



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

- మంత్రి నారాయణ వెల్లడి

6



## ఎకానమీ సృష్టికి

# చిరునామాగా తెలుగుజాతి

- ఎన్ని జన్మలెత్తినా తెలుగుజాతిలోనే పుట్టాలని కోరుకుంటా
- భవిష్యత్‌లో అమరావతి, హైదరాబాద్ సిటీలు మొదటి, రెండవ స్థానంలో ఉంటాయి
- తెలుగు వన్ అధినేత కంఠంనేని రవిశంకర్ పట్టుదల, కృషి అందరికీ ఆదర్శం
- డిజిటల్ ఛానళ్లలో తిరుగులేని శక్తిగా తెలుగు వన్
- సోషల్ మీడియా వేదికగా ఆడబిడ్డల వ్యక్తిత్వ హననం.. దీనిపై నియంత్రణ అవసరం
- తెలుగు వన్ డిజిటల్ మీడియా రజతోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- వివరాలు 2లో...

## హైదరాబాద్‌లో ఘోరం

అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి

సీఎం చంద్రబాబు సంతాపం

మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

2



## పసిబిడ్డల మృతి కలిచివేసింది

- వేరువేరు ఘటనల్లో

ఏడుగురు పిల్లల మృతిపై సీఎం చంద్రబాబు విచారం

- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా

2

## సమాజ హితం కోసం

# పనిచేసే పార్టీ తెలుగుదేశం

- నాలుగు దశాబ్దాల పార్టీకి మూలస్తంభాలు కార్యకర్తలే
- వారి సేవలను పార్టీ ఎప్పటికీ విస్మరించదు
- రాష్ట్రానికే ఆదర్శంగా టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం
- నియోజకవర్గ మినీ మహానాడులో మంత్రి అచ్చెన్నాయుడు

5



## ప్రతిష్ఠాత్మకంగా మహానాడు

ఏర్పాట్లపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమీక్ష



కడప (చైతన్యరథం): మహానాడును ప్రతిష్ఠాత్మకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు సమష్టి కృషి అవసరమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ తొలిసారిగా కడపలో నిర్వహించనున్న మహానాడు ఏర్పాట్లపై మంత్రుల కమిటీ, పార్టీ నేతలతో ఆదివారం పల్లా శ్రీనివాసరావు సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, ఎంపీ దగ్గుమళ్ల, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడు ఏర్పాట్లపై నేతలు విస్తృతంగా సమీక్షించారు. మహానాడు విజయవంతం కోసం కమిటీలు ఏర్పాటు చేసి, ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించారు. మహానాడు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి ఏర్పాటును పకడ్బందీగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు. బహిరంగ సభ, ప్రతినిధుల సభ నిర్వహణపై మంత్రుల కమిటీ సమీక్షించింది. కడప నగరం సమీపంలోని సీకేదిన్నె మండలం పబ్బాపురంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహిస్తున్నారు. మొదటి రెండు రోజులు ప్రతినిధుల సభ జరుగుతుంది. మూడోరోజు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కడప యువతకు మార్గదర్శి

పీ4 స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్



4

- నేడు శంకుస్థాపన చేయనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

మద్యం కుంభకోణంపై సిట్ విచారణతో..

## జగన్ రెడ్డి గుండెల్లో గుబులు

- అధికారం అండతో వేల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు
- అడ్డంగా దొరికిన దొంగలు దిక్కుమాలిన ఆరోపణలు చేస్తున్నారు
- తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదు
- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ



4

## ఎకానమీ సృష్టికి

# చిరునామాగా తెలుగుజాతి



- ఎన్ని జన్మలెత్తినా తెలుగుజాతిలోనే పుట్టాలని కోరుకుంటా
- భవిష్యత్‌లో అమరావతి, హైదరాబాద్ సిటీలు మొదటి, రెండవ స్థానంలో ఉంటాయి
- తెలుగు వన్ అధినేత కంఠంనేని రవిశంకర్ పట్టుదల, కృషి అందరికీ ఆదర్శం
- డిజిటల్ చానళ్లలో తిరుగులేని శక్తిగా తెలుగు వన్
- సోషల్ మీడియా వేదికగా ఆడబిడ్డల వ్యక్తిత్వ హననం..దీనిపై నియంత్రణ అవసరం
- తెలుగు వన్ డిజిటల్ మీడియా రజతోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

హైదరాబాద్, (చైతన్యరథం) : ఎకానమీ సృష్టికి చిరునామాగా తెలుగుజాతి ఉంటుందని, నాలెడ్జ్ ఎకానమీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో తెలుగుప్రజలు ముందుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఎన్ని జన్మలైనా తాను తెలుగుజాతిలోనే పుట్టి సేవ చేయాలని కోరుకుంటాననన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం కంఠంనేని రవిశంకర్‌కు చెందిన తెలుగు వన్ డిజిటల్ మీడియా రజతోత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు.

**రవిశంకర్ పట్టుదల ఆదర్శం**

తెలుగు వన్ డిజిటల్ మీడియా ప్రయాణం 2000 సంవత్సరంలో ప్రారంభమై నేడు 400 ఛానల్స్‌తో ప్రతి దేశంలో ఉంది. రవిశంకర్ మంచి కృషి, పట్టుదలతో పనిచేస్తున్నారు. నేను విజన్ రూపొందిస్తే దానికి సమానంగా ఆయన కూడా ఛానల్ అభివృద్ధిలో విజన్ రూపొందించుకుని ముందుకెళ్తున్నారు. ఒకప్పుడు ఆకాశవాణి తప్ప ఏమీ ఉండేవి కాదు. తర్వాత వార్తా పత్రికలు వచ్చాయి. తర్వాత సమాజంలోకి ఎలక్ట్రానిక్ మీడియా వచ్చింది. 2003లో అలిపిరిలో నాపై మావోయిస్టులు దాడి చేశారు. అప్పుడు ఒక్క జెమినీ ఛానల్ మాత్రమే ఉంది..కానీ ఇప్పుడు అనేకం ఉన్నాయి. రవిశంకర్ లాంటి వ్యక్తులు అనేక ఛానల్స్ తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇంట్లోనే కూర్చుని ఛానల్ పెట్టుకుని ఆదాయాన్ని కూడా పొందే అవకాశం వచ్చింది. న్యూస్ పేపర్‌కు సర్క్యులేషన్, శాటిలైట్ ఛానల్‌కు టీఆర్పీ, య్యూటూబ్ ఛానల్‌కు వ్యూస్, సబ్‌స్క్రైబ్స్ ఉంటాయి. తెలుగు వన్ ఛానల్ ఇప్పటి వరకు 55 బిలియన్ వ్యూస్ సాధించింది. 120 మిలియన్ల సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. 16 లక్షల వీడియోలను, 15 వందలకు పైగా సినిమాలు ఉన్నాయి. తిరుగులేని శక్తిగా తెలుగువన్ తయారైంది. కంఠంనేని రవిశంకర్ అమరావతి రాజధానిపైనా సినిమా తీశారు. నాడు భయపెట్టే పరిస్థితులు ఉన్నా వెనక్కి తగ్గకుండా న్యాయం, ధర్మం కోసం అమరావతికి అన్యాయం జరిగిందని చెప్పి సినిమా తీశారు. సెన్సార్ పేరుతో విడుదల కానివ్వకుండా చేస్తే య్యూటూబ్‌లో వదిలారు. 2000 మంది పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. ఆయన సేవా కార్యక్రమాల పట్ల అభినందనలు తెలుపుతున్నాను. తెలుగు వన్ స్ఫూర్తి పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలుపుతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఈనాడు చొరవతో 30 రోజుల్లోనే ఎన్టీఆర్ మళ్లీ సీఎం**

కొన్నాళ్ల క్రితం నేను అరెస్టయిన సమయంలో హైదరాబాద్‌లో మీరు పోరాడిన విధానం నా జీవితంలో మర్చిపోలేను. మనం మంచిపని చేస్తే ప్రజలు మర్చిపోతారు అని అంటుంటారు.. కానీ మనం చేసిన మంచి పట్ల ప్రజలు ఏ విధంగా స్పందిస్తారనేది నా అరెస్టు సమయంలో చూశాను. గతంలో నలభై ఏళ్ల కిందట ఆగస్టు సంక్షోభం వచ్చినప్పుడు ఎన్టీఆర్ పక్షాన మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నా సీఎం పదవి నుంచి దించేశారు. ఆ సమయంలో ఈనాడు దినపత్రిక చూపిన చొరవతో 30 రోజుల్లోనే తిరిగి ఎన్టీఆర్ మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. పేదరికాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పీ4 ద్వారా అత్యున్నత స్థాయిలో ఉన్నవారు కింద స్థాయిలో ఉన్నవారిని దత్తత తీసుకుంటే మనతో సమానంగా పైకి వస్తారు. ఎన్టీఆర్ కూడా సాధారణ కుటుంబంలో పుట్టి అచంచలమైన ఆత్మవిశ్వాసంతో పైకొచ్చారు. మళ్లీ ఎన్టీఆర్ లాంటి వ్యక్తులు రారు..ఆయనతో పోల్చుకోవాలంటే మళ్లీ ఆయనే జన్మించాలని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

**అగ్రభాగాన తెలుగువారే ఉంటారు**

1995-96లో తెలుగు ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మాత్రమే ఉండేవి. మన తెలుగువారి భవిష్యత్ మారే పరిస్థితి రావాలంటే ఐటీ రంగాన్ని అందిపుచ్చుకోవాలని నిర్ణయించుకున్నాను. ఐటీని ప్రమోట్ చేయాలనే హైటెక్ సిటీ నిర్మించా.

మన వారికి పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాం. ఇప్పుడు ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా ఇండియన్స్ ఉంటారు, అందులో అగ్రభాగాన తెలుగువారు ఉన్నారు. హైటెక్ సిటీ నిర్మిస్తుంటే అందరూ నవ్వారు..కానీ తర్వాత దాని ఫలాలు అందుతున్నాయి. ప్రస్తుత సమయంలో కష్టపడాల్సిన అవసరం లేదు...స్మార్ట్‌గా చేయాలి. నాలెడ్జ్ ఎకానమీలో హిస్టారికల్ సమాచారం ఉంది. ఏ రంగం తీసుకున్నా ఇప్పుడు ఏఐ వచ్చింది. రియల్ టైంలో డేటా సేకరించే అవకాశం వచ్చింది. నాడు హైటెక్ సిటీ, ఐటీ గురించి మాట్లాడాను...ఇప్పుడు ఏఐతో క్వాంటమ్ వ్యాలీ అని చెప్తున్నాను. 2047 నాటికి ప్రపంచలో ఇండియన్స్ ముందుంటే అందులో తెలుగువారు అగ్రభాగాన ఉండాలనేది నా ఆశయం..ఇది సాధ్యమవుతుంది. భారతీయులతో పోటీ పడేవారు ప్రపంచంలో ఎక్కడా లేరని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**అమరావతి నిర్మించే అదృష్టం దక్కింది**

క్రియేటివ్ ఎకానమీలో రెండు సిటీలు రూపొందిస్తున్నారు..ఒకటి ముంబై, రెండోది అమరావతి. అమరావతి క్రియేటివ్ ఎకానమీకి చిరునామాగా ఉంటుంది. ప్రస్తుతం అత్యంత నివాసయోగ్యమైన సిటీగా హైదరాబాద్ అవతరించింది. ఉమ్మడి రాష్ట్రంలో నా హయాంలో 1995 నుంచి 2000 వరకు బ్లూ ప్రింట్ రెడీ చేసి ఔటర్ రింగ్ రోడ్, ఎయిర్ పోర్టు, జీనోమ్ వ్యాలీ, గచ్చిబౌలి స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌ను అప్పట్లో అభివృద్ధి చేసే అవకాశం కల్పించారు. మీ అందరి ఆశీర్వాదాలతో ఇప్పుడు నాకు మరో అవకాశం దక్కింది. మరోనగరం అమరావతిని తెలుగుజాతికి అందించే అదృష్టం దక్కింది. భవిష్యత్తులో అమరావతి, హైదరాబాద్ మొదటి, రెండవ స్థానాల్లో ఉంటాయని సీఎం చంద్రబాబు అన్నారు.

**వ్యక్తిత్వ హననంతో సమాజానికి హాని**

ఏది చేయాలన్నా విశ్వసనీయత అవసరం. ఎన్జీవోలు, మీడియాకు విశ్వసనీయత ఉండాలి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో పత్రికలు, జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారు. కానీ ఇప్పుడు పోటీ ప్రపంచంలో విలువలు పడిపోతున్నాయి. సోషల్ మీడియాతో ఎంత లాభం ఉందో..అంతనష్టం ఉంది.

సోషల్ మీడియాను వేదికగా తీసుకని వ్యక్తిత్వ హననం, తప్పుడు సమాచారానికి పాల్పడుతున్నారు. దీనిపై నియంత్రణ అవసరం. ఇళ్లలో ఉండే ఆడబిడ్డల వ్యక్తిత్వాన్ని హననం చేస్తే సమాజానికి హాని కలుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిష్పక్షపాత మీడియాను ప్రోత్సహించే అంశంపై ఆలోచిస్తాయి. దుర్మార్గపు ఆలోచన చేసే వారిని నియంత్రించాల్సి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో ఘోరం

### అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి - సీఎం చంద్రబాబు సంతాపం

హైదరాబాద్ (చైతన్యరథం): హైదరాబాద్ నగరంలో ఆదివారం ఉదయం జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందటంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చార్మినార్ వద్ద గుల్జార్ హౌస్‌లో జరిగిన విషాదకరమైన అగ్నిప్రమాదంలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాననన్నారు.

హైదరాబాద్‌లో చార్మినార్‌కు అత్యంత సమీపంలోని గుల్జార్ హౌస్ వద్ద ఉన్న ఓ జీ-2 భవనంలో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. మంటలతో పాటు దట్టమైన పొగలు వ్యాపించటంతో భవనంలో ఉన్న పలువురు ఊపిరి ఆడక స్పృహ కోల్పోయారు. దీంతో వారిని ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆస్పత్రులకు తరలించారు. కొందరు ఘటనాస్థలంలో.. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న మరికొందరిని బయటకు తీసుకొచ్చారు. 10 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. గుల్జార్ హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

**మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి**



హైదరాబాద్‌లోని చార్మినార్ పరిధి గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు దుర్మరణం పాలవడం పట్ల విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భవనం మొదటి అంతస్తులో చెలరేగిన మంటల్లో చిన్నారులు, మహిళలు సహా పలువురు మరణించడం విషాదకరం అన్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**బాలకృష్ణ సంతాపం**



గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు దుర్మరణం పాలవడం పట్ల హిందూపూర్ శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పసిబిడ్డల మృతి కలిచివేసింది

**- వేరువేరు ఘటనల్లో ఏడుగురు పిల్లల మృతిపై సీఎం చంద్రబాబు విచారం**

**- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా**

అమరావతి (చైతన్యరథం): విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో జరిగిన వేరు వేరు ఘటనల్లో ఏడుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేరోజు రెండు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఏకంగా ఏడుగురు పసిబిడ్డలు దూరమవ్వడం తనను తీవ్రంగా కలిచివేసిందని సీఎం అన్నారు.

చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురం గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు అడుకుంటూ నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన పిల్లలు గౌతమి, శాలిని, అశ్విన్ నీటి కుంటలో దిగి ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డల మృతితో తీవ్ర శోకంలో ఉన్న వారి తల్లిదండ్రులకు సీఎం చంద్రబాబు సానుభూతి తెలిపారు.

**విజయనగరంలో నలుగురు మృతి**

విజయనగరం జిల్లా ద్వారపూడి గ్రామంలో కారు డోర్లు లాక్ పడిన సంఘటనలో నలుగురు చిన్నారులు చనిపోవడంపై చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆడుకునేందుకు వెళ్లిన పిల్లలు...ఆగి ఉన్న ఒక కారు ఎక్కగా....డోర్ లాక్ పడి బయటకు రాలేక అందులోనే ఇరుక్కుని ఊపిరాడక చనిపోయిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం అన్నారు. కారులో చిక్కుకుని ఊపిరి అందక ఉదయ్, జాశ్రిత, చారులత, మణీశ్వరి ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు.

రెండు ఘటనల్లో 10 ఏళ్లు కూడా నిండని బిడ్డలు చనిపోవడం తనను తీవ్ర వేదనకు గురిచేసిందన్నారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.



# రజతోత్సవ వేడుక!

హైదరాబాద్‌లో ఆదివారం తెలుగు వన్ డిజిటల్ మీడియా రజతోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. తెలుగు జాతి ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్ని జన్మలైనా తాను తెలుగుజాతిలోనే పుట్టాలని కోరుకుంటానన్నారు. అప్పట్లో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే అవకాశం వచ్చిన తనకు ఇప్పుడు అమరావతి నగరాన్ని నిర్మించే అదృష్టం దక్కిందన్నారు.



















## మద్యం కుంభకోణంపై సిట్ విచారణతో..

# జగన్ రెడ్డి గుండెల్లో గుబులు



- అధికారం అండతో వేల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు
- సంస్థాగతంగా టీడీపీ అత్యంత బలమైన పార్టీ
- అడ్డంగా దొరికిన దొంగలు నేడు దిక్కుమాలిన ఆరోపణలు చేస్తున్నారు
- తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టేది లేదు
- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

మచిలీపట్నం (చైతన్యరథం): ప్రజల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిత్యం తపించే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి సమస్యలపై చర్చించి ఆ మేరకు రాష్ట్ర స్థాయి మహానాడులో తీర్మానాలు చేస్తామన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం, ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి లక్ష్యంగా 42 సంవత్సరాలుగా అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. సంస్థాగతంగా నాయకత్వాన్ని ఎన్నుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల నుండి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అత్యధిక మంది తెలుగుదేశం పార్టీ అనే ఫ్యాక్టరీ నుండి వచ్చిన వారే అన్నారు. కోటి మంది సభ్యత్వంతో దేశ చరిత్రలో తెలుగుదేశం రికార్డు సృష్టించిందన్నారు. గ్రామస్థాయి తీర్మానాలు లక్ష్యంగా ఈనెల 21న మచిలీపట్నం నియోజకవర్గ మహానాడు, 23న జిల్లా మహానాడును నిర్వహిస్తున్నాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో శిక్షణ తరగతులు ప్రారంభించామని, ప్రజలకు మేలు చేయడం, సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

ప్రజల కోసం తెలుగుదేశం ఏ స్థాయిలో పనిచేస్తుందో మొన్న ఓబులాపురం కేసులో గాలి జనార్దన్ రెడ్డికి శిక్ష ఖరారుతో స్పష్టమైందన్నారు. నాడు గాలి జనార్దన్ రెడ్డి అవినీతిపై తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహా అనేకమంది నాటి నాయకులు చంద్రబాబుపై అనేక నిందారోపణలు చేశారు. కానీ నేడు వారి దోపిడీని కోర్టు నిర్ధారించి శిక్ష విధించింది. జగన్ నా సోదరుడు అని నాడు గాలి జనార్దన్ రెడ్డి కితాబ్ ఇచ్చాడు.. ఇప్పుడు జగన్ రెడ్డి ఏం సమాధానం చెబుతారని మంత్రి రవీంద్ర ప్రశ్నించారు.

### జనం చీత్కరించినా బుద్ధిరాలేదు

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో జగన్ రెడ్డి అరాచక పాలనకు, దోపిడీలు, దౌర్జన్యాలకు ఎదురొడ్డి పోరాడాం. ప్రపంచంలో ఎక్కడా లేని స్థాయిలో వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం జరిగింది. ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను హరించి జగన్ రెడ్డి తన ఖజానా నింపుకున్నాడు. వేల కోట్ల విలువైన బంగారం కొనుక్కొని దాచుకున్నాడు. వారి దోపిడీ మొత్తం సిట్ విచారణలో బయటకు రావడంతో నిందారోపణలకు తరలేపారు. ప్రజలు చీత్కరించినా జగన్ రెడ్డిలో మార్పు రాలేదు. అధికారులను బెదిరించి తప్పులు చేసి ఇప్పుడు ప్రభుత్వంపై తప్పుడు రాతలు రాయిస్తున్నారు. జగన్ దోపిడీకి సహకరించిన అధికారులంతా జైల్లో ఊచలు లెక్కబెడుతున్నారు. ఆధారాలతో సహా దొరికిపోయిన కేసులో ప్రజల్ని మభ్యపెట్టేందుకు తన అవినీతి పత్రికను జగన్ వాడుకుంటున్నాడు. కూటమి అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. మద్యం పాలసీలు అమలులో తప్పిదాలు జరిగాయంటూ పేదల బియ్యం బొక్కేసిన దొంగ మాట్లాడడం హాస్యాస్పదం. బెల్ట్ షాపులు గురించి మాట్లాడుతున్న పేర్ని నాని అవి ఎక్కడున్నాయో చూపించాలని మంత్రి రవీంద్ర సవాల్ చేశారు. వైసీపీ హయాంలో ఐదేళ్లు ప్రభుత్వ మద్యం షాపులు పేరుతో రాష్ట్రంలో జగన్ రెడ్డి దోపిడీకి పాల్పడితే మచిలీపట్నంలో బెల్టు షాపుల రూపంలో పేర్ని నాని ప్రజల్ని పీక్కుతిన్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ విచారణలో అక్రమాలన్నీ బయటపడుతున్నాయి. కేసుల చొప్పున డిస్టిలరీ నుండి కమీషన్లు దండుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్లను తరిమేసి కమీషన్లు ఇచ్చే కల్తీ బ్రాండ్లను మాత్రమే రాష్ట్రంలో అనుమతించారు. వాటిని మాత్రమే షాపుల్లో అందుబాటులో ఉంచారు. ఈ అక్రమాలన్నీ పరిశీలించిన తర్వాతే సిట్ అరెస్టులు చేసింది. తప్పు చేసిన వారిలో ఒక్కరిని కూడా వదిలేది లేదని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు.

### ప్రజలే గుణపాఠం చెబుతారు

ప్రజాస్వామ్యాన్ని గౌరవించి, ఆచరించి చూపించే తెలుగుదేశం పార్టీ సత్తా డబ్బారాయుళ్లకు ఏం తెలుస్తుందని మంత్రి రవీంద్ర ఎద్దేవా చేశారు. ఎక్సైజ్ పాలసీ, మైనింగ్ పాలసీ పక్కాగా తయారు చేసే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు అప్పగించారు. సామాన్య కుటుంబాల నుండి వచ్చిన వ్యక్తులకు ఇంత పెద్ద బాధ్యతలు ఇవ్వడం చూసి ఓర్వలేక పేర్ని నాని కడుపు మంటతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు. ఐదేళ్లు మంత్రిగా ఉండి మచిలీపట్నంలో గజం రోడ్డు వేయని వ్యక్తి ఈ రోజు ఆరోపణలు చేయడానికి మాత్రం ముందుకు వస్తున్నాడు. ఇప్పటికైనా పేర్ని నాని మాట్లాడే ముందు ఆలోచించుకుని మాట్లాడాలి. లేకుంటే బందరు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- ఉచిత వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల**



తెనాలి (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలంలో ఉన్న సీహెచ్‌సీలో ఈ వైద్య శిబిరాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేని వారు, డబ్బులు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేనివారు, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో లభించే వైద్య పరీక్షలు, సాధారణ శస్త్ర చికిత్సలు, స్త్రీల ఆరోగ్యం, పిల్లల వైద్యం, చెవి-ముక్కు-గొంతు, కంటి, దంత, గుండె సంబంధిత విభాగాలలో పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు కూడా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

ఈ ఉచిత వైద్య శిబిరంలో 20 మంది నిపుణులైన వైద్యులు, 50 మంది వైద్య సిబ్బంది సేవలందిస్తున్నారని మంత్రి వివరించారు. అంతేకాదు, ఎక్స్‌రే, స్కానింగ్ మిషన్లు, సాంకేతిక సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. రాబోయే రోజుల్లో బ్లడ్ బ్యాంక్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

కాగా రోగులతో మంత్రి ప్రత్యక్షంగా మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం తగిన విభాగ వైద్యుల వద్దకు వారికి స్వయంగా మార్గనిర్దేశం చేశారు. వైద్య పరీక్షలు, చికిత్సల ప్రగతిని స్వయంగా పర్యవేక్షించిన ఆయన, పరీక్షలు పూర్తయ్యాక అవసరమైన మందులు స్వయంగా అందించారు.

## శాప్ ఛైర్మన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రదానం




చిత్తూరు (చైతన్యరథం): చిత్తూరులోని పీఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 10వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ ఫైనల్ పోటీల్లో ఆదివారం శాప్ ఛైర్మన్ రవినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు శాప్ ఛైర్మన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నాయకులు ప్రకాష్ నాయుడు, హరిబాబు నాయుడు, డీఎస్డీఓ బాలాజీ పాల్గొన్నారు.

## కడప యువతకు మార్గదర్శి

**- పీ4 స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్**
**- నేడు శంకుస్థాపన చేయనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత**

కడప (చైతన్యరథం): పారిశ్రామిక ప్రగతికి, యువతలో ఆవిష్కరణకు, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించబడిన "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరగనుంది. కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఈ కేంద్రానికి శంకుస్థాపన చేయనున్నారని కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రం యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుంది. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని ఈ స్టార్ట్ అప్ హబ్‌ను ముందుకు తీసుకువెళ్తామన్నారు.

**ప్రాజెక్ట్ లక్ష్యాలు:**

స్టార్టప్ కడప కేంద్రాన్ని ఆవిష్కరణను ప్రోత్సహించడమే కాక, ఆలోచనల నుంచి అభివృద్ధి చెందిన వ్యాపారాల వరకు అన్ని దశల్లో స్టార్టప్‌లకు మద్దతు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వృత్తిపరమైన వర్క్‌స్పేస్‌లు, సహకార వాతావరణం వంటి అంశాలతో యువతకు అవసరమైన అన్ని వనరులు ఈ కేంద్రం అందించనుంది.

**నిర్మాణ వివరాలు:**

జీ ప్లస్ 3 అంతస్తులు, 25,000 చదరపు అడుగుల విస్తీర్ణం
పీఈబీ టెక్నాలజీ ఆధారంగా నిర్మాణం
పార్కింగ్ మరియు ప్రవేశ వసతులు: 25-30 కార్లకు పార్కింగ్, ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక స్థలాలు

**ల్యాండ్‌స్కేప్డ్ డ్రైవ్‌వే, లాబీ**

భవన వినియోగ ప్రణాళిక (Floor -wise Features)
గ్రౌండ్ ఫ్లోర్: డబుల్ హైట్ లాబీ, రిసెప్షన్, వేచి ఉండే ప్రదేశం, 200 సీట్ల ఆడిటోరియం, క్యాఫెటీరియా
మొదటి అంతస్తు: కాన్ఫరెన్స్ హాల్స్, మీటింగ్ రూములు, శిక్షణ గదులు
రెండవ, మూడవ అంతస్తులు: ఓపెన్ వర్క్‌స్టేషన్లు, ప్రైవేట్ గ్లాస్ కేబిన్లు, ఐడియా పాడ్లు, ఇన్‌ఫార్మల్ లాంజ్‌లు, బ్రేక్‌ఔట్ జోన్లు

**మౌలిక సదుపాయాలు:**

ట్విన్ లిఫ్ట్ కోర్, ఎనర్జీ ఎఫిషియెంట్ హెచ్‌వీఏసీ
సోలార్ రూఫ్‌కు అనుకూలత
వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ
పచ్చదనం, నీడలతో కూడిన వాక్‌వేలు, సురక్షిత సైట్ అభివృద్ధి

**ప్రాజెక్ట్ మొత్తం వ్యయం:**

ఈ ప్రాజెక్టును రూ. 10 కోట్లు అంచనా వ్యయంతో చేపడుతున్నారు. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ రూ. 4 కోట్లు విరాళం అందించింది. ఇందులో సివిల్ నిర్మాణం, ఫినిషింగ్ పనులు, హెచ్‌వీఏసీ, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వ్యవస్థలు, సైట్ అభివృద్ధి వ్యయాలు ఉన్నాయి. "స్టార్టప్ కడప" కేవలం ఒక భవనం మాత్రమే కాదు. ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా ఇది నిలవనుంది. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి ప్రాజెక్ట్ అని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# సమాజహితం కోసం పనిచేసే పార్టీ తెలుగుదేశం

- నాలుగు దశాబ్దాల పార్టీకి మూలస్తంభాలు కార్యకర్తలే
- వారి సేవలను పార్టీ ఎప్పటికీ విస్మరించదు
- రాష్ట్రానికే ఆదర్శంగా టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం
- నియోజకవర్గ మినీ మహానాడులో మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి (చైతన్యరథం): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, నాలుగు దశాబ్దాలుగా గ్రామ స్థాయిలో పార్టీ ఇంత పటిష్టంగా ఉందంటే అది కేవలం కార్యకర్తల వల్లనే సాధ్యమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నిరుపేదల జీవితాల్లో సంక్షేమం వెలుగులు నింపాలనే లక్ష్యంతో దివంగత నేత మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించారన్నారు. 43 సంవత్సరాలు పూర్తి చేసుకుని 44 సంవత్సరంలోకి టీడీపీ ప్రవేశించిందన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, సమస్యలు వచ్చినా వాటన్నింటినీ అధిగమించి రాష్ట్ర ప్రయోజనాల కోసం మన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఆయన సమర్థ పాలనతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా సభ్యత్వ నమోదు జరగడం ఆనందంగా ఉందన్నారు. యువ నాయకుడు నారా లోకేష్ ఆధ్వర్యంలో కార్యకర్తల కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చారని, దానిని వినియోగించుకోవాలని సూచించారు. సమగ్ర సమాచారం అందులో ఉంటుందని తెలిపారు. కార్యకర్తల శ్రమ పార్టీ గుర్తిస్తుందని అన్నారు. గత పాలకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా వాటన్నింటినీ అధిగమించి నేడు పార్టీ అధికారంలోకి వచ్చిందంటే కార్యకర్తల త్యాగఫలమేనన్నారు.

**వైసీపీ హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగింది**

వైసీపీ హయాంలో ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచక పాలన సాగిందని తీవ్రస్థాయిలో మండి పడ్డారు. టీడీపీ కార్యకర్తలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితులు చూశామని అన్నారు. నెత్తిమీద రూపాయి పెడితే పది పైసలకు పనికిరాని ఫోటా నాయకులు సైతం రెచ్చిపోయారని విమర్శించారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని, సుమారు 11 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. మద్యపాన నిషేధం అని చెప్పి రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటు ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు స్వేచ్ఛ లభించిందన్నారు. తాను ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని నమ్మే వ్యక్తినన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని, అందుకే నేడు మద్యం కేసులో ఒక్కొక్కరూ లోనికి వెలుతున్నారని విషయాన్ని గుర్తు చేశారు. తాము కక్ష రాజకీయాలు ప్రారంభిస్తే వైసీపీ నాయకులు ఒక్కరూ కూడా మిగలరన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 3.5 లక్షల పింఛన్లు తొలగించిందన్నారు. టీడీపీ సానుభూతిపరులనే కారణంగానే తొలగించారన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అదేవిధంగా సుమారు లక్షకు పైగా వితంతు పింఛన్లు ఆపేశారని వాటిని కూడా పునరుద్ధరించామని, జూన్ 12 న వారందరికీ పింఛన్లు అందిస్తామన్నారు.




**గ్రామ పంచాయితీలను నిర్వీర్యం చేశారు**

ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామపంచాయితీలను నిర్వీర్యం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. జగన్ రెడ్డి ఒక్కపైసాకూడా గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా మళ్లించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.

**సుజల స్రవంతి ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు**

సుజల స్రవంతి పథకం ద్వారా ఉత్తరాంధ్రాకు గోదావరి జలాలు తీసుకు వచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. 2026 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయన్నారు. విశాఖపట్నం వరకు సాగునీరు, తాగునీరు వస్తుందని, అక్కడ నుంచి శ్రీకాకుళానికి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**మూలపేట పోర్టు త్వరలో పూర్తి**

జిల్లాలో ఉన్న మూలపేట పోర్టును అతి త్వరలో పూర్తి చేస్తామని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 6 వేల ఎకరాలు సాల్ట్ భూమి ఉందని, ఆ భూమిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మత్స్యకారులకు వేట నిషేధ భృతి కింది 20 వేల రూపాయలు ఇచ్చామని తెలిపారు.

**రాష్ట్రంలోనే మోడల్ నియోజక వర్గంగా టెక్కలి**

రాష్ట్రంలోనే మోడల్ నియోజక వర్గంగా టెక్కలిని తీర్చిదిద్దుతామన్నారు. 2029 నాటికి అన్ని గ్రామాల్లో తారురోడ్లు, మౌలికసదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. అందులో భాగంగా రూ. 12 వందల కోట్లతో పనులు చేపడుతున్నామని, నిధులు కూడా మంజూరు అయ్యాయన్నారు. తొలుత టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల్లో ఈ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

**మహానాడు విజయవంతం చేయండి**

ఈ నెల 27 నుంచి 29 వరకు కడపలో పండగ వాతావరణంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని పార్టీ నాయకులను మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. పార్టీ చరిత్రలో ఎప్పుడూ కడపలో మహానాడు నిర్వహించలేదని అన్నారు. పార్టీ ఆవిర్భావం తరువాత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ సాధించామని, ఈ పండగను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు పి. అజయ్‌కుమార్, జీరు భీమారావు, బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, ఎల్.ఎల్. నాయుడు, తదితరతులు పాల్గొన్నారు.

## నేడు కొండపిలో టీడీపీ మినీ మహానాడు

కొండపి (చైతన్యరథం): ప్రకాశం జిల్లా కొండపిలోని శ్రీ సాయి సీతారామ కళ్యాణ మండపంలో కొండపి నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు కార్యక్రమం సోమవారం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొంటారు. వీరితో పాటు కొండపి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- త్వరలో మిగులు ధాన్యం కొనుగోలుకు చర్యలు
- ఎర్రకాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం
- కౌలు రైతులను ఆదుకుంటాం
- రైతులకు యంత్ర పరికరాల పంపిణీలో మంత్రి కందుల

నిడదవోలు (చైతన్యరథం): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం శింగవరం గ్రామంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నదాత సుఖీభవ పథకం వివరాలు, ఎర్రకాలువ ముంపుకు శాశ్వత పరిష్కారం, రైతన్నలకు యంత్ర పరికరాల పంపిణీ, నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్ల అంశంపై మాట్లాడారు.

అంతకుముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో రూ. 53.08 లక్షల అంచనా వ్యయంతో నిడదవోలు మండలం శింగవరం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం క్రింద ఏర్పాటు చేసిన 60000 లీటర్ల సామర్థ్యం గల మంచి నీటి ట్యాంక్, పైపులైనులు, బోరు, కుళాయిల ప్రారంభోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌కు శింగవరం గ్రామ ప్రజలు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. శింగవరం గ్రామంలో మొత్తం 720 ఇళ్లకు గాను 2348 మంది జనాభా నివసిస్తున్నారని, గ్రామానికి మొత్తం 3 ఓవర్ హెడ్ ట్యాంక్‌లు మంజూరు అయ్యాయని అందులో భాగంగా తొలుత 60,000 లీటర్లతో కూడిన ట్యాంక్‌ను నిర్మించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. దానికి అనుసంధానంగా బోర్‌తో పాటు 840 మీటర్ల పొడవైన పైపులైను వేశామన్నారు. 32 కుళాయి కనెక్షన్‌లు ఇచ్చామన్నారు. త్వరలోనే 40,000 లీటర్ల, 20000 లీటర్ల ట్యాంక్‌ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. నిధుల విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు మంత్రి కందుల దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా వ్యవసాయాధారిత నియోజకవర్గమైన నిడదవోలులో రైతులకు రూ. 1.99 కోట్ల విలువైన 100 యంత్ర పరికరాలు సబ్సిడీ కింద అందించామని తెలిపారు. ఇందులో ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ. 85.13 లక్షలు అని తెలిపారు. నిడదవోలు మండలంలో రూ. 85.60 లక్షల విలువైన 42 యంత్ర పరికరాలు పంపిణీ చేయగా అందులో సబ్సిడీ రూ. 36.24 లక్షలు అని తెలిపారు. శింగవరం గ్రామంలో రూ. 22.34 లక్షల విలువైన 11 యంత్ర పరికరాలు పంపిణీ చేశామని, అందులో ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ. 9.50 లక్షలు అని వివరించారు. అధికారులతో ప్రత్యేకంగా చర్చించి నిడదవోలు నియోజకవర్గానికి పెద్దసంఖ్యలో యంత్రపరికరాలు అందించే ఏర్పాటు చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల ఏర్పాటు ద్వారా తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేశామన్నారు. అందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిడదవోలు నియోజకవర్గంలోనే కొనుగోలు చేశామన్నారు. త్వరలో రైతుల నుండి మిగులు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడానని తెలిపారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలన్న రైతుల విజ్ఞప్తిని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. రైతులందరికీ మేలు చేసేలా నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఎర్రకాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం..

మరో వారం రోజుల్లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఎర్రకాలువ ముంపునకు పరిష్కారానికి శాశ్వత, దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నామని వివరించారు. త్వరలో జరిగే కేబినెట్ దృష్టికి ఇన్‌పుట్ సబ్సిడీ అంశం తీసుకువెళ్లి చర్చిస్తానన్నారు. కౌలు రైతుకు పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకునేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 2024 జులైలో సంభవించిన భారీ వర్షాల ధాటికి ఎర్రకాలువ ముంచెత్తి నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని నాడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ క్రమంలో తనతో పాటు మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పామని చెప్పినట్లు తెలిపారు. ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని, కానీ అంతకు ముందు జులై నెలలో సంభవించిన నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ అందించే విషయంలో కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయని వివరించారు. ఏది ఏమైనా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి తీరుతామన్నారు. కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ తో పాటు మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనం ఆధ్వర్యంలో

# ఆత్మకూరులో ఘనంగా తిరంగా యాత్ర




ఆత్మకూరు (చైతన్యరథం): నెల్లూరు జిల్లా ఆత్మకూరులో రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా యాత్ర ర్యాలీ అట్టహాసంగా జరిగింది. భారత రక్షణ దళాల సాహసాన్ని కీర్తిస్తూ దేశభక్తి నినాదాలతో యాత్ర సాగింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్, బిఎస్ఆర్ సెంటర్ మీదుగా సత్రం సెంటర్ వరకూ యాత్ర జరిగింది. కూటమి నాయకులతో పాటు పార్టీలకతీతంగా సామాన్య ప్రజానీకం ర్యాలీలో పాల్గొన్నారు. ఉగ్రవాదులపై పోరాడిన జవాన్లకు దేశం అండగా ఉంటుందంటూ ప్రజలు నినాదాలు చేశారు. జవాన్ల శౌర్యం, త్యాగాలను శ్లాఘిస్తూ నినాదాలతో పట్టణం మారుమోగింది. ఆత్మకూరులో చరిత్రలో నిలిచిపోయే విధంగా తిరంగా యాత్ర జరిగింది.

# భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నం తిరంగా ర్యాలీ

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి
- చాట్రాయిలో ఉత్సాహంగా తిరంగా యాత్ర
- సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు మద్దతుగా నినదించిన జనం
- సైనికా సలాం అంటూ సాగిన యాత్ర



ఏలూరు/చాట్రాయి (చైతన్యరథం): దేశ సరిహద్దుల్లో త్రివిధ దళాల సైనికులు చేస్తున్న పోరాటం, త్యాగాల వల్లే భారత భూభాగంలో మనందరం ఆనందంగా జీవిస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆదివారం సాయంత్రం ఏలూరు జిల్లా చాట్రాయిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు నూజివీడు నియోజక వర్గంలోని చాట్రాయి ఎన్టీఆర్ సెంటర్ వికాస్ స్కూల్ దగ్గర నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర నిర్వహించిన తిరంగ యాత్రలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భారీగా ప్రజలు పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన భారత పౌరులకు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అమరవీరుడు మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. పాకిస్థాన్ ఉగ్రమూకల పీచమణచడానికి సరిహద్దుల్లో పోరాటం సాగిస్తున్న సైనికులకు తామంతా వెన్నంటి ఉంటామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేసారు. భిన్నత్వంలో ఏకత్వానికి తిరంగా ర్యాలీ ఒక చిహ్నమని, భారతీయతకు ఇదొక నిదర్శనమన్నారు. మన స్త్రీల నుదుటి సింధూరాన్ని చెరిపివేస్తే ఆ దుష్టముష్కరులపై ఏ రకమైన ప్రతీకారం తీర్చుకుంటామో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసి చూపించారన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ధీరత్వాన్ని మంత్రి పార్థసారథి కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్ తో ఉగ్రస్థావరాలపై దాడి జరిపి భారతదేశ ప్రతిష్టను నిలబెట్టారున్నారు. తీవ్రవాదులు భారత్ పై దండెత్తితే ఆపరేషన్ సింధూర్ ద్వారా సమాధానం చెప్పిన ప్రధాన మోదీకి, ఆయనకు సహకరించిన జవాన్‌లకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. దేశ సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులు తామంతా వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు. ఏపీకి చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన మువ్వన్నెల జెండా నీడలో ముందుకు వెళుతూ భారతమాత ఆశీస్సులతో సైనికులతో కలిసి నడవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జాతీయ జెండాను చూడగానే ప్రతి ఒక్కరిలో దేశభక్తి, ఉద్వేగం ఉప్పొంగుతాయని అందుకే మువ్వన్నెల జెండాను పట్టుకొని తిరంగా ర్యాలీ ద్వారా తామంతా భారతీయులమనే నినాదాన్ని ప్రతిధ్వనించేలా నినదించాలని పిలుపునిచ్చారు. తిరంగా ర్యాలీకి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ప్రజలకు పేరుపేరున మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ తిరంగా యాత్రలో తహసిల్దార్ ఈశ్వర్, ఎంపిడిఓ విజయలక్ష్మి, ఎంఈఓ బ్రహ్మచారి, ఏపిఎం వెంకటేశ్వర రావు, మందపాటి బస్వా రెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, మందలపు జగదీష్, బొట్టు లక్ష్మణరావు, బిజెపి నాయకుడు రాజ ,అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సైనికుల త్యాగం.. మరువదు దేశం

- తిరంగా ర్యాలీలో మంత్రి దుర్గేష్
- నిడదవోలులో ఘనంగా తిరంగా ర్యాలీ






నిడదవోలు (చైతన్యరథం): పహల్గాం ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన భారత పౌరులకు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీర జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రార్థించారు. ఆదివారం సాయంత్రం తూర్పుగోదాదరి జిల్లా నిడదవోలు పట్టణంలో గాంధీ విగ్రహం నుండి గణపతి సెంటర్ వరకు కొనసాగిన తిరంగా ర్యాలీలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీరజవాన్ మురళీ నాయక్ మృతికి సంతాపంగా మౌనం పాటించి ఘన నివాళి అర్పించారు. వీర మరణం పొందిన మురళీనాయక్, సైనికుల త్యాగాన్ని దేశం మరవదు అన్నారు. నేడు మనం చేస్తున్న ప్రతి కార్యక్రమం సరిహద్దుల్లో ఉండి పోరాడుతున్న సైనికుల ఆత్మస్థైర్యానికి, ధైర్యానికి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ఇద్దరు మాజీ సైనిక అధికారుల కృషిని వేదికపై ప్రస్తావించారు. నేడు మనమంతా శాంతియుతంగా జీవితం కొనసాగిస్తున్నామంటే అందుకు కారణం సైనికులు, సైనికాధికారుల చొరవవల్లేనని తెలిపారు. మువ్వన్నెల జెండా రెపరెపలాడుతుండగా చేసిన తిరంగా ర్యాలీతో త్రివిధ దళాలు, సైనికులకు తాము వెన్నంటే అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నిర్మూలించడమే ధ్యేయంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భారత జాతి మీద కన్నెత్తితే తగిన గుణపాఠం చెప్పేందుకు భారత పౌరులుగా తాము సిద్ధంగా ఉంటామని తెలిపారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఉన్న సువిశాల భారతదేశంలో భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు, భిన్న మతాలు, భిన్న కులాలు ఉన్నప్పటికీ మనమంతా భారతీయులమేనని అన్నారు. మనందరం గౌరవంగా భావించే స్త్రీల నుదటన ఉగ్రవాదులు సింధూరాన్ని చెరిపివేస్తే ఆ దుష్ట ముష్కరులపై ఏ రకమైన ప్రతీకారం తీర్చుకుంటామో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసి చూపించారన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ధీరత్వాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రస్థావరాలపై దాడి జరిపి భారతదేశ ప్రతిష్టను నెలబెట్టారని తెలిపారు. తీవ్రవాదులు భారత్ పై దండెత్తితే ఆపరేషన్ సింధూర్ ద్వారా సమాధానం చెప్పిన ప్రధాన మోదీకి, ఆయనకు సహకరించిన జవాన్‌లకు సెల్యూట్ అని చెప్పారు. ఈ సందర్భంగా జై జవాన్, జై కిసాన్, భారత్ మాతాకీ జై అని నినదించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్, మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కూటమినాయకులు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

### - మంత్రి నారాయణ వెల్లడి



నెల్లూరు (చైతన్యరథం): రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 16 వరకు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు నిర్వహిస్తూండడం సంతోషంగా ఉందన్నారు.

నెల్లూరు నగరంలోని పప్పుల వీధి ఎస్బీఎస్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా ట్రస్ట్ చైర్మన్ డూండి రాకేష్ ఆధ్వర్యంలో అమరజీవి 125వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారాయణ విచ్చేశారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి నారాయణను వ్యాపార సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అమరజీవి జీవిత చరిత్ర ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరజీవి జయంతి ఉత్సవాలు ఈ ఏడాది మార్చి 16 నుండి వచ్చే ఏడాది మార్చి 16 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

అమరజీవి గాంధేయవాదని తెలిపారు. మూడుసార్లు జైలుకు కూడా వెళ్లారని, తెలుగు రాష్ట్రం కోసం 58 రోజుల నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయులని కొనియాడారు. దళితుల ఆలయ ప్రవేశం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని, అన్ని తరాలు గుర్తుపెట్టుకోవాల్సిన త్యాగశీలి అని కొనియాడారు. ఆయన నెల్లూరు జిల్లా వాసి కావడం మనకెంతో గర్వకారణం అని తెలిపారు.

రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. 22 ఎకరాల్లో ఇండియాలో బెస్ట్ మార్కెట్‌ను నెల్లూరు నగరంలోని తొమ్మిదో డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆ మార్కెట్‌కు పొట్టి శ్రీరాములు మార్కెట్‌గా నామకరణం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులందరూ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎన్విరాన్మెంటల్ ఛైర్మన్ దినేష్ రెడ్డి, నుడా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అజీజ్, రూప్ కుమార్ యాదవ్, పెళ్లకూరు శ్రీనివాస్, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరంలో హోరెత్తిన తిరంగా ర్యాలీ

## ఎమ్మెల్యే శిరీష ఆధ్వర్యంలో పాల్గొన్న వేలాది జనం

రంపచోడవరం, (చైతన్యరథం): ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైనిక దళాలకు సంఘీభావంగా రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. యుద్ధంలో చనిపోయిన వీర జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన భారత సైనికులు అందరికీ మనమందరం రుణపడి ఉన్నామని అన్నారు. మన రాష్ట్ర జవాన్ మృతి పట్ల వారికి సంఘీభావం తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కులాలకు, మతాలకు రాజకీయాలకు అతీతంగా పాల్గొన్న ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఆర్మీ జవాన్ గోవిందరావు ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చిన్నం బాబు రమేష్, జీసిసి డైరెక్టర్ గొర్లె సునీత, రంపచోడవరం ముస్లిం మత పెద్దలు ఎమ్‌డి గౌస్ మొహియుద్దీన్, సాయిబాబా గుడి పంతులు అద్దంకి వెంకటేశ్వరరావు గారు, సిఎస్ఐ చర్చి పాస్టర్ జ్ఞానానందం, జమాల్ ఖాన్, పోలీసులు, ఇతర శాఖల అధికారులు, పలు మండలాల కూటమి పార్టీల శ్రేణులు ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని, జాతీయ జెండాలతో సైనికులకు



## ఘనంగా పెదకూరపాడు మినీమహానాడు

పెదకూరపాడు, (చైతన్యరథం): నియోజకవర్గ శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో పెదకూరపాడు మహానాడు జరిగింది. ముఖ్య అతిధులుగా



విచ్చేసిన నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మపాటి శ్రీధర్ ,నల్లపాటి రాము పాల్గొన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ మరింతగా అభివృద్ధి చెందాలంటే అందరూ కలిసి పని చేయాలని ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. అన్ని విధాలుగా పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేలా కలిసి కృషి చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధినీ స్వాగతించాలన్నారు.రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎంతో మంది బడుగు బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీ రాజకీయ వృద్ధిని అందించిందన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ అన్నారు. రాజధానికి పెదకూరపాడు నియోజకవర్గం తరుపున ముప్పై ఐదు వేల ఎకరాలు ఇవ్వటానికి నావంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. బంగారు ఆంధ్రప్రదేశ్ గా మార్చటానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి అన్నారు.



# కడప మహానాడుకు భారీగా తరలి వెళ్లాలి

## విశాఖ పశ్చిమ టీడీపీ మినీ మహానాడులో ఎమ్మెల్యే గణబాబు పిలుపు

గోపాలపట్నం, (చైతన్యరథం): విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా నాయకులు , టీడీపీ వార్డ్ కార్పొరేటర్లు, వార్డ్ నాయకులు, మహిళా నాయకులు, బూత్ ఇంచార్జులు, కార్యకర్తలతో మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన శాసనసభ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఇటీవల కాలంలో మరణించిన తెలుగుదేశం పార్టీ నాయకులకు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళి అర్పించి వారు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ నెల లో 27, 28, 29 తేదీలలో కడప జిల్లాలో జరుగుతున్న మహానాడు కార్యక్రమనికి ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డ్ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడీ రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్, జిల్లా నాయకులు, వార్డ్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



# టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం

## అభివృద్ధి, సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం ఆగస్టు నాటికి హామీలన్నీ నెరవేరుస్తాం రామచంద్రపురం నియోజకవర్గ మహానాడులో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, గన్ని కృష్ణ, రెడ్డి సుబ్రమణ్యం

రామచంద్రపురం, (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధి, ప్రతి పేదవాని కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేయడమే తెలుగుదేశం లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నీతి, నిబద్ధతకు క్రమశిక్షణకు మారుపేరన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ్ మండపంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం గారి అధ్యక్షతన రామచంద్రపురం నియోజకవర్గ మహానాడు పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు గన్ని కృష్ణ, తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు గోపాలబాబు,చింతపల్లి వీరభద్రరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రేణులు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ పతాకావిష్కరణ చేసి అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిచారు. ఈ సమావేశంలో పార్టీ కోసం, భవిష్యత్ లో తీసుకొనే సంక్షేమ కార్యక్రమాలు మైనారిటీ, వాణిజ్య, మహిళ, యువత, కార్మికుల సంక్షేమంపై, నిరుద్యోగ నిర్మూలన పై పలు తీర్మానాలు చేసి ఆమోదింప చేశారు. తొలుత సభాధ్యక్షులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రతి పేదవాడికి గూడు, గుడ్డ, నీడ, అందించాలని ఆశయంతో ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, పేద వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఆంధ్ర



రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పరితపించే ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అనేక వేధింపులకు గురిచేశారన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ఆశయాలను పునికి పుచ్చుకుని మంత్రి సుభాష్ పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కడప మహానాడు సభల పరిశీలనకు వెళ్లిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చరవాణి ద్వారా మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గంఅభివృద్ధి చేస్తానని, పది మాసాల కాలంలో రూ.116 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి చేశామన్నారు. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ఆశయాలతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని, కార్యకర్తల సంక్షేమం కృషి చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని మే 27, 28, 29 తేదీలలో రాష్ట్ర మహానాడు నిర్వహించడం, నియోజకవర్గ మరియు జిల్లాస్థాయిలో మహానాడు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేద వర్గాలకు పింఛన్ అమలు, కిలో రెండు రూపాయలకే బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, 45 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్న పేద వర్గాల కోసం ఆలోచించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. ఈ నెల 22 పార్లమెంట్ మహానాడు అమలాపురంలో జరుగుతుందన్నారు. రానున్న ఆగస్టు నాటికి హామీలన్నీ అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అమలు జరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కడియాల రాఘవన్ స్వర్గీయ ఎన్టీ రామారావు కు భారతరత్న అవార్డు ఇవ్వాలని, పలు తీర్మానాలు ప్రవేశపెట్టి సభ్యులచే ఆమోదింప చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి సూర్య నారాయణ, అక్కల రిశ్వంత్ రాయ్,నెక్కింటి బాల కృష్ణ, మేడిశెట్టి సూర్యనారాయణ, గుత్తుల బుల్లి రాజు, సలాది పట్టాభి రామయ్య, పెంకే సాంబశివరావు, కొత్తపల్లి శ్రీను, జాస్తి విజయలక్ష్మి, చిన్ని కృష్ణ, పేపకాయల నారాయణరావు, మేడిశెట్టి రవికుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా జగ్గంపేటలో టీడీపీ మినీ మహానాడు

## ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నియోజవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు

జగ్గంపేట, చైతన్యరథం): స్థానిక గోకవరం రోడ్డులోని కాపు సామాజిక భవనంలో జగ్గంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నియోజవర్గ టిడిపి పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మా తెలుగు తల్లి గీతాన్ని ఆలపించారు. జ్యోతి ప్రజ్వలన చేసి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం జగ్గంపేట నియోజకవర్గంలో చనిపోయిన వారికి నివాళులర్పించేందుకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. నియోజవర్గ స్థాయిలో టిడిపి నాయకులు 24 తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటినిలో 23 టిడిపి మినీ మహానాడులో ఆమోదించారు. ఒక తీర్మానాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు నిర్వహించుకున్నామని, 24 తీర్మానాలు ప్రవేశపెట్టగా 23 తీర్మానాలు ఆమోదించారన్నారు. ఎత్తిపోతల పథకానికి తోట తోట వెంకటాచలం పేరు తొలగించాలని పెట్టిన తీర్మానాన్ని పలువురు వ్యతిరేకించారు. 24వ తీర్మానంగా రాష్ట్రంలో ఉన్న టిడిపి కుటుంబ సభ్యులందరికీ భరోసా కల్పించేందుకు ఒక తీర్మానాన్ని రాష్ట్ర మహానాడులో ప్రవేశపెట్టాలన్నారు. జగ్గంపేట నియోజకవర్గం నాలుగు ప్రధాన అంశాలు సాగునీరు, తాగునీరు, విద్యా, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గం గడిచిన 11 నెలల కాలంలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, మౌలిక వసతులు, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజల కోసం ప్రతినిత్యం కష్టపడే నాయకుడు జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించుకుందామని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను తొందర్లోనే ప్రభుత్వం అమలు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, 12 మంది క్లస్టర్ ఇంచార్జిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.







# టీడీపీ మహానాడులో సాంప్రదాయ వంటకాలు

## మహానాడు కమిటీ సభ్యులు మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే జ్యోతుల కడపలో జాతీయ మహానాడు సభ వేదిక స్థల పరిశీలన

కాకినాడ, (చైతన్యరథం): కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ జాతీయ మహానాడు ఈనెల 27, 28, 29 తేదీలలో నిర్వహించేందుకు కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం గ్రామంలో సభా వేదిక ఏర్పాట్ల కోసం స్థలాన్ని మహానాడు కమిటీ సభ్యులు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జగ్గంపేట శాసనసభ్యుడు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, సిద్ధప్ప శ్రీనివాస్ రెడ్డి తదితరులు పరిశీలన చేశారు. అధిష్ఠానం ఆదేశం మేరకు వారు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. మహానాడుకు వచ్చే అతిథులకు వసతి ఏర్పాట్లు, మహానాడు సభ వేదిక అలంకరణతో పాటు వచ్చిన వారందరికీ రాయలసీమ సాంప్రదాయ వంటకాలు తో విందు భోజనాలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతోందని మహానాడు కమిటీ సభ్యులు తెలియజేశారు.

# కొత్తపేటలో హెూరెత్తిన తిరంగా యాత్ర

## పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి

కొత్తపేట, (చైతన్యరథం): ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో మన సైనిక దళాలకు సంఘీభావంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిర్వహించిన తిరంగా యాత్ర ర్యాలీలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగితో కలిసి పాల్గొన్నారు. జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, కేవీ సత్యనారాయణ రెడ్డి, ఆకుల రామకృష్ణ, అయినవిల్లి సత్తిబాబు గౌడ్ కూడా ఉన్నారు. ఈ కార్యక్రమం రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద నుండి కళా వెంకట్రావు విగ్రహం వరకూ నిర్వహించిన ఈ ర్యాలీలో భారత సైనికులకు జై అంటూ నినాదాలు హెూరెత్తింది. అలాగే స్థానిక మాజీ సైనికులను ఎమ్మెల్యే సత్యానందరావు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేశ భక్తి ఉట్టిపడేలా తిరంగా యాత్ర

## కుల మతాలకు అతీతంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వెంట తిరంగా యాత్రలో వేలాది మంది నంద్యాల ప్రజలు

నంద్యాల, (చైతన్యరథం): అందమైన సుందర కాశ్మీర్ ను చూసి వద్దాం అనుకున్న పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపితే తీవ్రవాదలు కాశ్మీర్ లోని పహాల్గాం లో దాడి చేసి మత పరంగా విభజించి కేవలం హిందువులను వారి పిల్లలు, భార్యల ముందే అతి దారుణంగా హత్య చేయడం ఎంతో భాధేస్తోందని, ఇలాంటి ముష్కరులకు భూమి మీద బ్రతికే అర్హత లేదని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. భారత త్రివిధ దళాలు పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులపై నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ అద్భుతంగా విజయం సాధించిన సందర్భంగా ఆదివారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి నాయకత్వంలో భారీ తిరంగా ర్యాలీ నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ నుంచి గాంధీ చౌక్ వరకు భోలో భారత్ మాతాకీ జై, ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాధాలతో ఉత్సహంగా సాగి మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ చౌక్ లోనే సైనికులు, మాజీ సైనికులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆధ్వర్యంలో సన్మానం చేసి, అమర జవాన్ మురళీ నాయక్ కు, పహాల్గాం మృతులకు సంతాపం తెలిపారు. ఈ సందరర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ భారత దేశం ధర్మాన్ని నమ్ముకుందని, పాకిస్తాన్ పై భారత్ ముందు యుద్ధం మొదలు పెట్టలేదన్నారు. అయితే భారత్ జోలికి వస్తే తాట తీస్తామని భారత సైన్యం ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్ కు, మన శత్రుదేశాలకు స్పష్టంగా అర్థమయ్యేలా నిరూపించారని. ఆపరేషన్ సింధూర్ ఇది టైటిల్ మాత్రమేనని అసలు సినిమా ముందుందని మన రక్షణ,



హెూం మంత్రులు ఇప్పటికే చెప్పారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. మన మహిళల సింధూరం తుడిపిన తీవ్రవాధులకు మన మహిళా సైనికుల ద్వారానే గట్టి బుద్ధి చెప్పడం జరిగిందని, ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా వెతికి వెంట బడి తీవ్రవాదుల తలలు తీసే సత్తా ప్రతి భారతీయుడికి ఉందన్నారు. మా నంద్యాల ప్రజలకు ప్రభుత్వం తుపాకులు ఇస్తే పాకిస్తాన్ లోకి వెళ్లి తీవ్రవాధుల తలలు తెస్తాం అంటూ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆగ్రహం తో ప్రసంగించారు. ఈ తిరంగా ర్యాలీలో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారటీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షులు ముస్తాక్ అహమ్మద్, టీడీపీ యువనేత ఎన్ ఎం డీ ఫిరోజ్, శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్. జి. రామకృష్ణా రెడ్డి, దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, సెంట్రల్ సివిల్ సప్లయ్ కమిటీ డైరెక్టర్ నరహరి విశ్వనాధ్ రెడ్డి, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, మాజీ సైనికులు, సైనిక కుటుంబాలు, బార్ అసోసియేషన్, నంద్యాల వైద్యుల సంఘం, పలు విద్యాసంస్థల అధినేతలు, అధ్యాపకులు, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, మహిళా, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, ఎన్‌సీసీ విద్యార్థులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# నిడదవోలులో ఘనంగా తిరంగా యాత్ర

## హుషారుగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

నిదవోలు, (చైతన్యరథం): నిడదవోలు పట్టణం ఆదివారం భారత్ మాతాకీ జై వందేమాతరం అనే నినాదాలతో మారుమోగింది. నిడదవోలు శాసనసభ్యులు మంత్రివర్యులు కందుల దుర్గేష్ మాజీ శాసనసభ్యుడు స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు గాంధీ బొమ్మ సెంటర్ నుండి ప్రారంభమై వినాయకుడి గుడి సెంటర్. ఐలవ్‌యు నిడదవోలు వరకు సాగింది. నిడదవోలు పట్టణ, నియోజకవర్గ ప్రజలు దేశభక్తిని చాటుకున్నారు.



# ఘనంగా టీడీపీ గురజాల టీడీపీ మహానాడు

### పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గురజాల, (చైతన్యరథం):పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన గురజాల నియోజకవర్గం మహానాడు కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల శాసనసభ్యులుయరపతినేని శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, గురజాల నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖర్ రెడ్డి, యువనాయకులు యరపతినేని నిఖిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండాని ఆవిష్కరించి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రతిమకి పూల మాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగువారి ఖ్యాతిని, ఆత్మగౌరవాన్ని ప్రపంచం వ్యాప్తంగా చాటి చెప్పిన నందమూరి తారక రామారావుగురించి, ఆయన ప్రాముఖ్యత గురించి వివరించి నేతలు కొనియాడారు. ఈనెల 27, 28, 29న కడప మహానాడు కార్యక్రమంలో గురజాల నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో పాల్గొని, మహానాడు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చెయ్యాలని యరపతినేని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గంలోని అన్ని మండలాల మండల పార్టీ కన్వీనర్లు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల/పట్టణ, గ్రామ, వార్డు స్థాయిల్లో వివిధ హోదాల్లో ఉన్నటువంటి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, విద్యావంతులు పాల్గొన్నారు.





# ఆరోగ్యవంతమైన జీవనశైలికి మంచి ఆరంభం

### విజయవాడలో “ఎస్ ఎస్ ఎలైట్ కేఫ్‌ను ప్రారంభించిన ఏపీటీడీసీ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

విజయవాడ ఫన్‌టైమ్ క్లబ్ రోడ్డులో ఎస్ ఎస్ ఎలైట్ కేఫ్ (వేంగంట ప్లాంట్ బేస్డ్ ఫుడ్)ను ఆదివారం ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఈ రోజుల్లో అత్యధికంగా ప్రాసెస్డ్ ఫుడ్, అధిక నూనె, కొవ్వు పదార్థాలు ఉండే ఆహారం తీసుకుంటుండటంతో మధుమేహం, హైపర్‌టెన్షన్, గుండె సంబంధిత వ్యాధులవంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకునే తత్వాన్ని కలిగిన ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉండే ప్లాంట్ బేస్డ్ ఫుడ్ అత్యంత అవసరం. ‘వేంగంట’ బ్రాండ్ ద్వారా ప్రారంభించిన ఈ ఎస్ ఎస్ ఎలైట్ కేఫ్‌లో తక్కువ నూనెతో, అధిక పోషకాలతో తీయబడిన పిజ్జాలు, బర్గర్లు, పానీయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ నూనెతో చేసిన ఆహారమూ రుచికరంగా ఉండగలదనే విషయాన్ని ఈ కేఫ్ నిరూపిస్తోంది. అలాంటి ఆహారం మన శరీరానికి మేలు చేస్తుంది, దైనందిన జీవితంలో చురుకుగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ప్రారంభోత్సవంలో సినీ నటి అవికా గోర్, ఏఎస్పీ దామోదర్, సిద్ధు రెడ్డి, కందగట్ల చంద్రశేఖర్ యాదవ్, మోహన్ యాదవ్, కేఫ్ ప్రొప్రైటర్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





# కోలాహలంగా కోడుమూరు మినీ మహానాడు

### పాల్గొన్న ఎమ్మెల్యే, కేడీసీసీచైర్మన్, టీడీపీ అధ్యక్షుడు

కోడుమూరు, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఆదేశాలమేరకు కోడుమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హాల్లో భారీ ఎత్తున జరిగింది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ప్యాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూల్ పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు కోడుమూరు నియోజకవర్గ పరిశీలకులు కాటప్పగారి రామలింగారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇండియా పాకిస్తాన్ యుద్ధంలొ చనిపోయిన వారికి, అలాగే ఈ సంవత్సర కాలంలో చనిపోయిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు సంతాపం తెలపడం జరిగింది. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కోడుమూరు నియోజకవర్గంలో, ఎలాంటి వర్గ విభేదాలు లేవని,





నియోజవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చాలా వేగంగా జరుగుతున్నాయని, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. రాబోయే 27 తేదీన జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని భారీ ఎత్తున జయప్రదం చేయాలని నియోజవర్గ కార్యకర్తలకు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జోహార్ ఎన్టీఆర్, కోడుమూరు నియోజకవర్గంలో మినీ మహానాడు జరుపుకోవడం చాలా సంతోషమన్నారు. కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాలా సహకారం అందిస్తున్నారు, అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కర్నూలు ఎంపీ నాగరాజు, కర్నూల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిక్కారెడ్డి, కోడుమూరు నియోజకవర్గ పరిశీలకులు రామలింగారెడ్డి, నియోజకవర్గ నాయకులు, నాలుగు మండలాల కార్యకర్తలు, కుటుంబం సాధికార సభ్యులు, పాల్గొన్నారు.



# సాగరతీరంలో తిరంగాయాత్ర

### పాల్గొన్న కేంద్రమంత్రి, విశాఖ మేయర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

విశాఖపట్నం, (చైతన్యరథం): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పిన నేపథ్యంలో త్రివిధ దళాల సైనికులకు, భారత ప్రధానినరేంద్ర మోడీకి సంఘీభావంగా విశాఖలో నిర్వహిస్తున్న తిరంగా యాత్రకు తన సంఘీభావం తెలుపుతూ విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆదివారం ఆయన విశాఖ నగరంలో బీచ్ రోడ్డు పార్క్ హెూటల్ నుండి కాళీమాత ఆలయం వరకు తిరంగ యాత్రలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవాస వర్మ, బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఈస్ట్ ఎమ్మెల్యే లివెలగపూడి రామకృష్ణ బాబు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహ రావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ , తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు గండి బాబ్జి , వీఎంఆర్‌డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, బీజేపీ అధ్యక్షుడు పరశురామ రాజు లతో కలిసి త్రివిధ దళాల సైనికులకు, భారత ప్రధాని నరేంద్ర మోడీకు సంఘీభావం తెలుపుతూ, మన దేశ రక్షణకు భారత సైనికుల నిరంతర కృషి, శ్రమ, త్యాగం, పట్టుదల పట్టుకొమ్మలని తెలుపుతూ తిరంగా యాత్రలో మేయర్ పాల్గొన్నారు.



# త్రివిధ దళలకు మద్దతుగా తీరంగా యాత్ర

### పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాల, (చైతన్యరథం): పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణం నందు “ఆపరేషన్ సిందూర్” విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుండి నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు నిర్వహించిన తిరంగా యాత్ర (ర్యాలీ)లో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు శ్రీ జంగా కృష్ణమూర్తి, నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖర్ రెడ్డి యువనాయకులు యరపతినేని నిఖిల్ త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకొని ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత త్రివిధ దళాలకు అభినందనలు తెలుపుతూ, వారి పోరాట పటిమకు, సేవలకు సంఘీభావంగా తిరంగా యాత్ర(ర్యాలీ)లో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సైనికోద్యోగులు ఐతం నాగేశ్వరరావు(నాయక్), మొగిలి వెంకటేశ్వర్లు నాయక్(సుబేదార్)లను సన్మానించారు.





# ఉగ్రవాదులను ఉరికించి కొడతాం

## మంత్రి పొంగూరు నారాయణ హెచ్చరిక

నెల్లూరు, (చైతన్యరథం): అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొడతామని చెప్పిమరీ ముష్కరుల పీచమణిచిన భారత ప్రధానికి, సైన్యానికి దేశప్రజలు అండగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు నగరంలో వేలాది మంది ప్రజలు మనం సైతం దేశం కోసం అంటూ జాతీయ పతాకాలు చేతబూని భారత్ మాతాకీ జై అని నినదిస్తూ వీఆర్సీ సెంటర్ నుండి గాంధీ విగ్రహం వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి పార్టీల నాయకులు తోడుగా యువకులు, విద్యార్థులు, మాజీ సైనికులు, వివిధ వర్గాల ప్రజలు వేయి అడుగుల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. వందేమాతరం నినాదంతో వి ఆర్ సి సెంటర్ మార్మోగింది. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ 26 మంది అమాయక పౌరులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు కోలుకోలేని దెబ్బ కొడతామని ఆ రోజే భారత ప్రధాని చెప్పినట్లుగానే అతి తక్కువ సమయంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో చేపట్టిన భారత సైన్యం పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందన్నారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతుగా నిలిచే వారికి సరైన గుణపాఠం నేర్పిందన్నారు. పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల జవానులు అనిర్వచనీయమైన విజయం సాధించారని కొనియాడారు. అలాగే భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రభాగాన నిలపాలని కృషి చేస్తున్న భారత ప్రధానికి ఉగ్రవాదంపై పోరులో ప్రపంచంలోని అన్ని దేశాలు సంఘీభావం తెలిపాయన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను భారత ప్రజలందరూ ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలియజేస్తూ వారికి ఘన నివాళి అర్పించారు.



### భారత్ జోలికొస్తే తాటతీస్తాం

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ భారతదేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదని, తనుకు తానుగా మరొకరి జోలికి వెళ్ళదని, కానీ తమ జోలికి వస్తే తాట తీస్తామని భారత సైన్యం నిరూపించిందన్నారు.

### విధ్వంసాలకు చిరునామా పాకిస్తాన్

ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం శాంతికాముక దేశమని చేసిన చరిత్ర ఎన్నడూ లేదన్నారు. సమయంలో విధ్వంసాలకు చిరునామాగా పాకిస్తాన్ మిగిలిపోయింది అన్నారు. భారత సైనిక శక్తి ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. తిరంగా ర్యాలీలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి ,జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనికోద్యోగులు శ్యాంప్రసాద్, కళాధర్, రత్నయ్య, కూటమి నేతలు నూనె మల్లికార్జున్ యాదవ్, గనుకుల కిషోర్, అశేష ప్రజలు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

## హోరెత్తిన జాతీయ నినాదాలు

నెల్లూరు రూరల్, (చైతన్యరథం): ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కేవీఆర్ పెట్రోల్ బంక్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీ సాగింది. వేలాదిగా జనం తరలి వచ్చి స్వచ్ఛందంగా ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ సంబరాలలో పాల్గొన్నారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తించారు. ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకొని మువ్వన్నెల పతాకాలు చేతబట్టి దేశభక్తిని చాటారు. దేశ రక్షణలో అమరులైన సైనికుల త్యాగాలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, గిరిధర్ రెడ్డి కొనియాడారు. మరోసారి తోక జాడిస్తే ప్రపంచ పటంలో పాకిస్తాన్ కనపడదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మాతృభూమి రక్షణలో అశువులు బాసిన తెలుగు వీరుడు మురళి నాయక్‌కు నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాలలో పాల్గొన్న ప్రజానీకానికి ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# యర్రగొండపాలెంలో 60 అడుగుల జాతీయ జెండా

## తిరంగా యాత్రలో పాల్గొన్న ఎరిక్సన్‌బాబు

ఎర్రగొండపాలెం, (చైతన్యరథం): భారత సాయుధ దళాల వీరోచిత పోరు ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జి ఎరిక్సన్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీలకు అతీతంగా 60 అడుగుల భారీ జాతీయ జెండాతో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు జెండా ఊపి తిరంగా యాత్ర ప్రారంభించారు. బాబు మాట్లాడుతూ పాకిస్తాన్ దొంగబుద్ధిని భారత్ తిప్పికొట్టి విజయాన్ని సాధించినందుకు దేశమంతా గర్విస్తుందన్నారు. దేశ ప్రజలందరూ త్రివిధ దళాలకు మద్దతుగా ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రజలు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, ఎన్సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.




# విశాఖలో తిరంగా యాత్ర

## పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

విశాఖపట్టణం): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పిన నేపథ్యంలో త్రివిధ దళాల సైనికులకు, భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంఘీభావంగా విశాఖలో నిర్వహించిన తిరంగా యాత్రకు సంఘీభావం తెలుపుతూ వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పాల్గొన్నారు. ఆదివారం విశాఖ నగరంలో బీచ్ రోడ్డు పార్క్ హోటల్ నుండి కాళీమాత ఆలయం వరకు తిరంగా యాత్రలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవాస వర్మ, బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదమ్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, మాజీ ఎంపీ శ్రీ జీవీఎల్ నరసింహ రావు, మాజీ ఎమ్మెల్సీ పీవీ మాధవ్, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామ రాజు, తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు గండి బాబ్జి , కూటమి కార్పొరేటర్ లు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి త్రివిధ దళాల సైనికులకు, భారత ప్రధాని నరేంద్ర మోడీకు సంఘీభావం తెలిపారు.



# శ్రీకాళహస్తిలో ఘనంగా మినీ మహానాడు

శ్రీకాళహస్తి, (చైతన్యరథం): నియోజకవర్గంలో ఘనంగా మినీ మహానాడు జరిగింది స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్ నియోజకవర్గ పరిశీలకులు అంకయ్య చౌదరి నివాళులర్పించారు. వేలాదిగా తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ స్థానం కల్పించిన ప్రతి ఒక్క కార్యకర్తకు పాదాభివందనం చేస్తున్నట్లు శ్రీకాళహస్తి శాసనసభ్యులు ప్రజల సుధీర్ రెడ్డి వెల్లడించారు.





# కార్యకర్తల కష్టం ఎప్పటికీ వృథా పోదు

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరు నగర నియోజకవర్గ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తున్నారని ఆ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. నెల్లూరు నగరంలోని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ మినీ మహానాడులో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నేతలు అందరూ కలిసి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళి అర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పహల్గాం దాడిలో, ఆపరేషన్ సిందూర్ లో చనిపోయిన అమాయకులు, జవాన్ లకు, ఇటీవల కాలంలో మృతి చెందిన పార్టీ కార్యకర్తలకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మహానాడులో అనేక తీర్మానాలను ప్రతిపాదించారని, ప్రతిపాదించిన తీర్మానాలకు వందరెట్లు అధికంగా చేయాలని నారాయణ మనసులో ఉందని అన్నారు. కుటుంబంతో సమానంగా కార్యకర్తలను చూసుకుంటున్న వ్యక్తి నారాయణ అని పేర్కొన్నారు. నారాయణ కార్యకర్తలకు చేసే సహాయం కుల మతాలను చూసి చేయడం లేదని చేసే పనిని బట్టి చేస్తున్నారని అన్నారు. నెల్లూరు నగరంలో కార్యకర్తల కష్టం ఎప్పటికీ వృథా పోదని అన్నారు. కార్యకర్తలకు మంత్రి నారాయణ అండగా ఉన్నారని, కార్యకర్తలు ధైర్యంగా ఉండొచ్చని తెలిపారు. నారాయణ దగ్గర నుంచి తాను చాలా విషయాలు నేర్చుకున్నానని రాజకీయాల్లో అరుదైన వ్యక్తి నారాయణ అని అన్నారు. ఈనెల 23న విపిఆర్ కన్వెన్షన్ హాల్ నందు నెల్లూరు పార్లమెంట్ మినీ మహానాడు జరగనుందని కార్యక్రమానికి నెల్లూరు నగర నియోజకవర్గ కార్యకర్తలు అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, డిప్యూటీ మేయర్ లు రూప్ కుమార్ యాదవ్, సయ్యద్ తహసీన్, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.



# హిందూపురంలో ఘనంగా టీడీపీ మినీ మహానాడు

**ముఖ్య అతిథులుగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, హిందూపురం ఎంపీ బీకే. పార్థసారథి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర**

హిందూపురం, (చైతన్యరథం): స్థానిక జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్డే అంజినప్ప పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప మాట్లాడుతూ నియోజవర్గ నియోజవర్గ స్థాయిలో టీడీపీ కుటుంబ సభ్యులందరికీ భరోసా కల్పించేందుకు కొన్ని తీర్మానాలను రాష్ట్ర మహానాడులో ప్రవేశపెట్టాలన్నారు. నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ తెప్పించి అపరభగీరథుడు బాలయ్య రైతులను ఆదుకున్నారని గుర్తు చేసుకున్నారు.

అదే కాలువ వెడల్పు చేయ్యాలని, మరిన్ని పరిశ్రమలు తెప్పించి నియోజకవర్గంలోని యువతకి ఉపాధి కల్పించాలని కోరూతూ తీర్మానించారు. గడిచిన 11 నెలల కాలంలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, మౌలిక వసతులు, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజల కోసం ప్రతినిత్యం కష్టపడే నాయకుడు హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించుకుందామని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను తొందర్లోనే ప్రభుత్వం అమలు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ రెడ్డి, కురుబ రాష్ట్ర డైరెక్టర్ పరిమళ, దేవానహల్లి ఆనంద్, సీనియర్ నాయకులు నెట్టేప్ప, అంజినప్ప, రాము, భాస్కర్, అమర్నాథ్, మల్లిఖార్జున, అరుణాచల రెడ్డి, ప్రెస్ వెంకటేష్, సుమో శీనా, తిమ్మయ్య, శివకుమార్, రాష్ట్ర పార్టీ పరశీలకుడు రాజాక్, డైరెక్టర్ బేకరీ గంగాధర్, మారుతీ ప్రసాద్, నాగలింగారెడ్డి,కొండూరు శ్రీరాములు, కల్లూరి నరసింహులు, రాము ప్రెసిడెంట్, నంబూరి సతీష్, రాజు, తెలుగుయువత ప్రభాకర్, శ్రీనివాసులు, మంజునాథ్, కృష్ణమూర్తి, నాగరాజు, అనిల్, ఐటీడీపి జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, శ్రీనివాసులు, నజీర్ అహ్మద్, సురేష్, అనిల్, రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా, రామాంజినమ్మ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, కౌన్సిలర్లు సతీష్, రాఘవేంద్ర, మల్లిఖార్జున, గిరీష్, నాగేంద్రమ్మ, హరీష్, నాగేంద్ర మండల కన్వీనర్లు జయప్ప, రంగారెడ్డి, బీసీ సెల్ నాయకులు దుర్గ నవీన్, కోడికొండ బాలాజీ, నంజుండప్ప, లక్ష్మీనారాయణ, క్రిష్టప్ప, శేఖర్, ఆంజనేయులు, మైనార్టీ నాయకులు హాజమాత్, హంజాద్, ముబారక్, భాషా, ఫకృద్దీన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, క్లస్టర్ ఇంచార్జిలు, సర్పంచులు, ఎంపిటీసీలు, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా నందికొట్కూరు టీడీపీ మహానాడు

**పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే జయసూర్య తదితరులు**

నందికొట్కూరు, (చైతన్యరథం): నందికొట్కూరు పట్టణం ఎన్నెస్ ఫంక్షన్ హాల్‌లో నందికొట్కూరు నియోజకవర్గ మహానాడు జరిగింది. కార్యక్రమంలో మొదట జ్యోతి ప్రజ్వలన చేసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమంలో నియోజకవర్గ సమస్యలపై చర్చించి పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేసిన తీర్మానాలను రాష్ట్ర పార్టీ మరియు ముఖ్యమంత్రి గారి దృష్టికి చేర్చి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సూచించడం జరిగినది.కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు దేవల్ల మురళి, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు, గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాలొన్నారు.



# త్వరలో రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ డబ్బులు

**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**



కొత్త చెరువు, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టో మేరకు అర్హులైన ప్రతి రైతుకు త్వరలో ప్రభుత్వం వారి ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తుందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులకు ఏడాదికి రూ.20 వేలు మూడు దశల్లో వారి ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత రైతుల వివరాలు ఆయా మండల వ్యవసాయ శాఖ అధికారుల వద్ద సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కొత్త చెరువు మండలంలో జరిగిన పలు వివాహానికి అదివారం హాజరైన సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుకొనే పిల్లలు ఉంటే అంతమందికి జూన్ లో తల్లికి వందనం కింద వారికి రూ.15 వేలు ప్రభుత్వం జమ చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆగస్టులో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మిగతా హామీలను దశలవారీగా తూచా తప్పకుండా అమలు చేసి తీరుతామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడించారు. ఏపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3వేల పించన్ 4 వేలకు పెంచి మూడు నెలలకు ఒకేసారి 65 లక్షల కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేసి నిరూపించుకుందన్నారు. అంతేగాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 16,500 టీచర్ ఉద్యోగాల భర్తీని త్వరలో చేపడుతోందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్షన్ రద్దు చేసిన విషయాన్ని మాజీ మంత్రి గుర్తు చేశారు. అంతే కాకుండా ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా కూటమి ప్రభుత్వం నెరవేర్చి మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. అనంతరం కొత్తచెరువు మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్డులో లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జరిగిన తలమర్ల వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారికి మాజీ మంత్రి చేతుల మీదుగా నూతన వస్త్రాలను బహకరించారు. కొత్తచెరువు మండలంలోని పాత దేవరపల్లిలో చెన్నకేశవస్వామి ఆలయంలో జరిగిన శ్యామపురం వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి హాజరయ్యారు వరుడు యశ్వంత్ వధువు శ్రావణీలను ఆశీర్వదించి వారికి వస్త్రాలు అందజేశారు. అక్కడినుండి పుట్టపర్తి మండలం వీడుపల్లి అభయాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో జరిగిన మేడా వారి వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి హాజరయ్యారు నాగ సాయి వర్ధిని మణికంఠ వివాహానికి హాజరై నూతన వధూవరులను మాజీమంత్రి ఆశీర్వదించారు వారికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి



**బాలకృష్ణ ఇలాకాలో**

# హోరెత్తిన తిరంగా యాత్ర

హిందూపురం, (చైతన్యరథం): పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను అంతం చేయాలనే లక్ష్యంతో భారత త్రివిధ దళాలు చేసిన ఆపరేషన్ సింధూర్ విజయం సందర్భంగా తిరంగా యాత్ర బైక్ ర్యాలీ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలో సూగూరు ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో మున్సిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, వీరయ్య, బాలాజీ, టీడీపీ సత్య సాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజినప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ జెవిఎస్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాఘవేంద్ర, నాగేంద్రమ్మ, టీడీపీ నాయకులు అమర్ నాథ్, దుర్గా నవీన్, ప్రెస్ వెంకటేష్, హెచ్. ఎన్. రాము నంబూరి సతీష్, బీజేపీ నాయకులు పార్ట్ సారథి, ఆదర్శ్ కుమార్, అంజలి రెడ్డి, వరప్రసాద్, జనసేన నాయకులు ఆకుల ఉమేష్ శేఖర్ చక్రి మహిళా నాయకురాలు పరిమళ, వెంకట లక్ష్మీ, భాగ్యమ్మ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మలమడుగులో తిరంగా యాత్ర

**పాల్గొన్న కూటమి నాయకులు**

జమ్మలమడుగు, (చైతన్యరథం): పెహల్గామ్ ఉగ్రదాడిలో బలైన భారత పౌరుల ఆత్మకు శాంతి చేకూరేలా వారి కుటుంబాల కన్నీటి నుండి పుట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ దాడి చేసి విజయం సాధించిన తరుణంలో భారత త్రివిధ దళాలకు, భారత ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయాలకు సంఘీభావం ప్రకటిస్తూ జమ్మలమడుగులో జరిగిన తిరంగా యాత్రలో కూటమి నాయకులతో కలిసిప్రభుత్వ విప్, జమ్మలమడుగు నియోజకవర్గం ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, కడప పార్లమెంట్ కూటమి ఇంచార్జ్, జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సి. భూపేష్ సుబ్బరామిరెడ్డి ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి , జనసేన జమ్మలమడుగు కన్వీనర్ డాక్టర్ నాగార్జున, కూటమి నాయకులు, మండల ఇంచార్జ్‌లు, అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆదోనీలో తిరంగా ర్యాలీ

**పాల్గొన్న టీడీపీ ఇన్చార్జి మీనాక్షీ నాయుడు తదితరులు**

ఆదోని, (చైతన్యరథం): భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ అద్భుత విజయాన్ని సాధించిన సందర్భంగా దేశ రక్షణలో వారి అపూర్వ త్యాగం, ధైర్యసాహసాలను స్మరించుకుంటూ వారికి సంఘీభావంగా ఆదివారం ఆదోని లో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో, ఆదోని టీడీపీ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు, పార్థసారథి, మాజీ శాసనసభ్యులు సాయిప్రసాద్ రెడ్డి టీడీపీ యువ నాయకులు భూపాల్ చౌదరీ, జనసేన ఇంచార్జీ మల్లప్ప, యువ నాయకులు సిద్ధార్థ నాయుడు, యువ నాయకులు మారుతి నాయుడు, మాజీ సైనికులు అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు అన్ని వ్యాపార వర్గాల ప్రజలు పాల్గొన్నారు.



# రాజ్యాంగమే సర్వోన్నతమం: సీజేఐ గవాయ్



ముంబయి: శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఉద్ఘాటించారు. మూలస్తంభాలుగా ఉన్న ఈ వ్యవస్థలన్నీ కలిసి పని చేయాలని అన్నారు. 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఆదివారం మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో మాట్లాడారు. భారత్ పురోగతి సాధించడమే కాకుండా ఆర్థిక, సామాజిక రంగాల్లోనూ అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థ, పార్లమెంటు కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనది. మూలస్తంభాలుగా ఉన్న ఈ మూడు విభాగాలు రాజ్యాంగం ప్రకారం కలిసి పని చేయాలి. ఇందులోని అన్ని వ్యవస్థలు సహకారం అందించుకుంటూ పరస్పరం గౌరవించుకోవాలి. రాజ్యాంగ మౌలిక స్వరూపం పటిష్టంగా ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను గతంలో ఇచ్చిన 50 కీలక తీర్పులతో రూపొందించిన పుస్తకాన్ని సీజేఐ జస్టిస్ గవాయ్ ఆవిష్కరించారు.

మహారాష్ట్రకు చెందిన జస్టిస్ గవాయ్.. సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి రాష్ట్రంలో పర్యటించారు. బీఆర్ అంబేద్కర్ స్మారకమైన చైత్యభూమిని సందర్శించి నివాళులు అర్పించారు.

# బీఎస్పీలో మాయావతి మేనల్లుడికి మళ్లీ కీలక పదవి



న్యూఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాయావతి మరోసారి తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌కు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీ చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్‌గా ఆయనను నియమించారు. ఢిల్లీ లోథిరోడ్‌లోని సెంట్రల్ ఆఫీస్‌లో బీఎస్పీ జాతీయస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొ న్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్ని జిల్లాల అధ్యక్షులు, కోఆర్డినేటర్లతోపాటు జాతీయ కోఆర్డినేటర్లు, జనరల్ సెక్రటరీలు, రాష్ట్రాల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆకాష్ ఆనంద్‌కు పార్టీ చీఫ్ నేషనల్ కోఆర్డినేటర్‌గా మాయావతి బాధ్యతలు అప్పగించారు. ఈసారి పార్టీని, పార్టీ ఉద్యమాన్ని అత్యంత జాగరూకతతో, నిబద్ధతతో ఆయన ముందుకు తీసుకువెళ్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఆకాష్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు గత మార్చి 3న మాయావతి ప్రకటించారు. ఆకాష్ తన మామ అశోక్ సిద్ధార్థ్ ప్రభావానికి లోనుకావడంతో మాయావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బహిష్కరణ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. పార్టీ నేషనల్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఆకాష్‌ను అంతకు ముందు తన రాజకీయ వారసుడిగానూ మాయావతి ప్రకటించారు. పార్టీ నుంచి బహిష్కరించిన 40 రోజుల తర్వాత తిరిగి ఏప్రిల్ 13న ఆయనను పార్టీలోకి మాయవతి తీసుకున్నారు. గతంలో చేసిన పొరపాట్లకు ఆకాష్ విచారం వ్యక్తం చేయడంతో మాయవతి ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌పై వ్యాఖ్యలు: ప్రొఫెసర్ అరెస్ట్



న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలకు గాను హర్యానాలోని అశోకా యూనివర్శిటీలో పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్ మహమూద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ యువజన విభాగం సభ్యుడు ఒకరు చేసిన ఫిర్యాదుపై ఢిల్లీలో ఆయనను కస్టడీలోకి తీసుకున్నారు. హర్యానా మహిళా కమిషన్ సైతం మహమూద్ వ్యాఖ్యలపై నోటీసులు జారీ చేసింది. కల్నల్ సోఫియా ఖురేషిని ప్రశంసిస్తున్న రైట్-వింగ్ సపోర్టర్లను మహమూద్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రశ్నించారు. ఇదే వ్యక్తులు మూక దాడులు, ఏకపక్షంగా ఇళ్ల కూల్చివేత ఘటనల్లో బాధితులను గురించి కూడా మాట్లాడితే బాగుంటుందని అన్నారు. కాగా, తన కామెంట్లను తప్పుగా అర్థం చేసుకున్నారంటూ మహమూద్ ఆ తర్వాత వ్యాఖ్యానించారు.

మహమూద్ అరెస్టును హర్యానా పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ అజీత్ సింగ్ ధ్రువీకరించారు. కాగా, ప్రొఫెసర్ అరెస్టు వ్యవహారం ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. ఈ అరెస్టును ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు. ఆయన వ్యాఖ్యలు దేశవ్యతిరేకంగానో, స్త్రీ ద్వేషంతో కానీ చేసినవి కావని, తమ అభిప్రాయాలను చెప్పిన వ్యక్తులను పోలీసులు టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. హర్యానా పోలీసులు.. ప్రొఫెసర్‌ను ఢిల్లీలో అరెస్టు చేసినదే నిజమైతే అది న్యాయప్రక్రియను ఉల్లంఘించడమే అవుతుంది. ఆయన చేసిన వ్యాఖ్యల్లో దేశవ్యతిరేకత కానీ, స్త్రీ ద్వేషం కానీ ఎక్కడా లేదు. కేవలం ఒక బీజేపీ కార్యకర్త చేసిన ఫిర్యాదుతోనే ఈ అరెస్టు చోటుచేసుకుందని ఒవైసీ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రొఫెసర్ అరెస్టు షాకింగ్‌గా ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ వ్యాఖ్యానించారు. మహమూద్ కామెంట్లు ఆయన వ్యక్తిగతమని, సంస్థ అభిప్రాయం కాదని అశోక్ యూనివర్శిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

# రీశాట్-1బీ ప్రయోగం విఫలం



శ్రీహరి కోట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ప్రయోగంలో సాంకేతిక సమస్య తలెత్తింది. మూడవ దశ తర్వాత నుంచి ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో రాకెట్ ప్రయోగం విఫలం అయింది. రాకెట్ ప్రయోగం విఫలం అవ్వటంపై ఇస్రో ఛైర్మన్ నారాయణన్ స్పందించారు. పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ప్రయోగం పూర్తి కాలేదని తెలిపారు. విశ్లేషణ తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు.

సరిహద్దుల్లో నిరంతర నిఘా కోసం ఉద్దేశించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లడానికి పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ప్రయోగం జరిగింది. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం అవ్వగా.. ఆదివారం ఉదయం 5.59కి నింగిలోకి దూసుకెళ్లింది. కొద్దిసేపటి తరువాత పీఎస్ఎల్వీ సీ 61లో సాంకేతిక సమస్య తలెత్తి ప్రయోగం విఫలమయింది.

ఈఓఎస్-09 ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు. దీని జీవితకాలం ఐదేళ్లు. ఇది అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూమి ఉపరితల చిత్రాలను అధిక రిజల్యూషన్‌తో తీయగలదు. జాతీయ భద్రత, వ్యవసాయ, అటవీ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాలను రేయింబవళ్లూ ఇమేజింగ్ చేస్తుంది. దేశవ్యాప్తంగా విస్తరించిన రియల్ టైం కవరేజీ అవసరాన్ని పరిష్కరించే లక్ష్యంతో ఈఓఎస్-09 కూడా భూ పరిశీలన ఉపగ్రహాల సమూహంలో చేరనుంది.

# యూట్యూబర్ జ్యోతి చరిత్ర పెద్దదే



హిస్సార్: పాకిస్థాన్‌కు రహస్య సమాచారం చేరవేసిందనే ఆరోపణలపై యూ ట్యూబర్, ట్రావెల్ బ్లాగర్ జ్యోతి మల్హోత్రాను పోలీసులు అరెస్ట్ చేయటం సంచలనం కలిగించింది. అయితే గత ఏడాదిగా ఆమె చేసిన వ్యవహారాలను తెలుసుకుంటే ఆమె అమాయకురాలు కాదని అర్థమవుతుంది. ఆమె యూట్యూబ్ ఛానెల్ ట్రావెల్ విత్ జో ద్వారా పాకిస్థాన్‌కు రహస్య సమాచారం పంపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో విచారణలో భాగంగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. హిసార్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శశాంక్ కుమార్ సావన్ ఈ సందర్భంగా పలు విషయాలను పంచుకున్నారు. జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో ముఖ్యంగా ఈషాన్-ఉర్-రహీమ్ (దానిష్)తో వాట్సాప్. టెలిగ్రాం, స్నాప్‌చాట్‌వంటి ఎన్‌క్రిప్టెడ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా గోప్య సమాచారాన్ని పంచుకున్నట్లు గుర్తించామన్నారు.

### పాకిస్థాన్, చైనా పర్యటనలు

అంతేకాదు 2023లో జ్యోతి పాకిస్థాన్‌కు రెండు సార్లు పర్యటించినట్లు వెల్లడించారు. అక్కడ ఆమెకు పాకిస్థాన్ హై కమిషన్ ఉద్యోగి దానిష్ వసతి ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. అలీ ఎహ్వాన్ ఆమె పర్యటనలను చూసుకున్నాడని, దీంతోపాటు ఆమె చైనాలో కూడా ఒక సారి పర్యటించినట్లు చెప్పారు. ఆ క్రమంలో ఆమె వీడియోలు పాకిస్థాన్ పర్యటనల గురించి ఉండేవని గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో పాకిస్థాన్ స్థలాల గురించి సమాచారం ఉండేది. ఆ వీడియోల ద్వారా పాకిస్థాన్ సమర్థతను పెంచేందుకు ప్రయత్నం చేసినట్లు గుర్తించారు.

### పాకిస్థాన్ ఏజెంట్లతో సంబంధం

దానిష్, పాకిస్తాన్ హై కమిషన్‌లో పనిచేసే మరో ఉద్యోగి, జ్యోతి మల్హోత్రాకు హ్యాండ్లర్‌గా వ్యవహరించారు. అతను ఆమెను ఇతర ఏజెంట్లతో పరిచయం చేశారు. వారిలో షకీర్, రానా షాహ్‌బాజ్ కూడా ఉన్నారు. జ్యోతి మల్హోత్రా ఇతర యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్లతో కూడా సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో వారు కూడా పాకిస్థాన్ ఏజెంట్లతో సంబంధాలు కలిగి ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

ఆమె ప్రయాణాలకు, ఆమె ప్రకటించిన ఆదాయంతో పొంతన లేకుండా ఉందని ఎస్పీ సావన్ తెలిపారు. ఆమె స్పాన్సర్డ్ ట్రిప్‌ల ద్వారా పాకిస్థాన్ సందర్శించినట్లు చెప్పారు. అంతేకాదు పహల్గామ్ దాడికి ముందు పాకిస్థాన్‌లోనే ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం జ్యోతి మల్హోత్రాను ఐదు రోజుల పోలీస్ రిమాండ్‌లో ఉంచారు. ఈ క్రమంలో అధికారులు ఆమె ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ కమ్యూనికేషన్లను పరిశీలిస్తున్నారు.

### పూరి ఎందుకొచ్చారు?

ఇలా ఉంటే జ్యోతి మల్హోత్రా గత ఏడాది ఒడిశాలోని పూరి వచ్చారని, అక్కడ స్థానిక మహిళా యూ ట్యూబర్ ఒకరిని కలిసినట్లు గుర్తించామని పూరి ఎస్పీ వినీత్ అగర్వాల్ వెల్లడించారు. ఆమె పూరి పర్యటన వెనుక ఉద్దేశం ఏమిటనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె పూరిలో ఎక్కడుంది..అనమానాస్పద కార్యాకలాపాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై విచారణ జరుపుతున్నామన్నారు. పూరి యూట్యూబర్ వివరాలను పోలీసులు బయటపెట్టలేదు. అయితే సదరు యూ ట్యూబర్ మాత్రం ఈ వ్యవహారంపై స్పందించారు. ఆమె నాకు స్నేహితురాలు అనేది వాస్తవమే. అయితే ఆమె గూఢచర్యం చేస్తోందనే విషయం మాత్రం నాకు తెలియదు. శత్రు దేశం పాకిస్థాన్ కోసం పనిచేస్తోందని తెలిస్తే ఆమెతో సంబంధాలు ఎప్పుడో తెంచేసుకునేదాన్ని. పోలీసులు నన్ను ప్రశ్నిస్తే అన్ని విషయాలు వివరంగా చెబుతాను. అన్నింటికన్నా దేశమే ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు.

# పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా పాక్ తీరు

## - భుట్టో నేతృత్వంలో విదేశాలకు బృందాలు



పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు పాకిస్థాన్ ప్రతీ విషయంలో భారత్‌ను అనుకరించాలని చూస్తోంది. ఉగ్రవాదానికి సపోర్టు చేస్తూ ఇప్పటికే ప్రపంచ దేశాల ముందు పాక్ పరువు పోగొట్టుకుంది. అయినా సిగ్గు లేకుండా శాంతి ప్రచారానికి సిద్ధమైంది. పాకిస్థాన్ అరాచకాలను ప్రపంచానికి చాటి చెప్పడానికి భారత్ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అన్ని పార్టీలకు చెందిన నాయకులతో ఏడు బృందాలను ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వం వాటిని వివిధ దేశాలకు పంపిస్తోంది. ఈ ఏడు బృందాలు ఎంపిక చేసిన దేశాల్లో పర్యటించి.. ఉగ్రవాదులను పాక్ పెంచి పోషిస్తున్న తీరు గురించి వివరించి చెప్పనున్నాయి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు.. ఈ విషయంలోనూ పాక్.. భారత్‌కు పోటీ రావాలని చూస్తోంది. భారత ప్రతినిధుల బృందం.. పాకిస్తాన్ ఉగ్రవాదులకు సాయం చేయడంపై, ఉగ్రవాదంపై భారత్ విధానాలను ప్రచారం చేయడానికి వెళుతుంటే.. పాక్ మాత్రం తాము శాంతికి పెద్ద పీట వేశామని చెప్పడానికి సిద్ధమైంది. ఈ మేరకు ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ విషయంపై మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ బుట్టో జర్దారీని పిలిపించారు. పాకిస్తాన్ శాంతి కోసం పరితపిస్తోందంటూ ప్రపంచ దేశాలకు వివరించాలని బుట్టోకు చెప్పారు. బుట్టో ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ నన్ను పిలిపించారు. పాక్ శాంతి కోసం పరితపిస్తున్న విధానాన్ని అంతర్జాతీయ వేదికలపై వివరించాలని చెప్పారు. ఆ బాధ్యతను తీసుకోవడానికి నేను ఎంతో గర్వపడుతున్నాను. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో కూడా దేశానికి సేవ చేయడానికి కట్టుబడి ఉన్నానని బుట్టో చెప్పుకొచ్చారు.

# బుర్కినాఫాసోలో టెర్రరిస్టుల దాడి

### 200 మంది సైనికుల మృతి



ఆఫ్రికన్ దేశమైన బుర్కినా ఫాసోలో సైన్యంపై అల్-ఖైదాతో సంబంధం ఉన్న ఉగ్రవాద సంస్థ దాడికి తెగబడింది. ఏకంగా 200 మంది సైనికులను పొట్టనపెట్టుకుంది. బుర్కినా ఫాసో చరిత్రలోనే ఇది అతిపెద్ద ఉగ్రదాడి. దాడి అనంతరం ఇది చేసింది తామే అని అల్‌ఖైదా అనుబంధ సంస్థ జేఎన్‌ఐఎం ప్రకటించుకుంది. జిబో నగరంలోని ఒక సైనిక స్థానిక స్థావరం, పోలీస్ స్టేషన్, మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకలు అనూహ్య దాడికి పాల్పడ్డాయి. ఈ దుర్ఘటనలో సైనికులతో పాటు పదుల సంఖ్యలో పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు చెబుతున్నారు. బుర్కినా ఫాసోలోని సైనిక స్థావరంపై జరిగిన దాడిలో 200 మంది సైనికులు మరణించారు.. అల్-ఖైదాతో సంబంధం ఉన్న జేఎన్‌ఐఎం సంస్థ ఈ దాడికి బాధ్యత వహించినట్లు సాయుధ గ్రూపుల ఆన్‌లైన్ కార్యకలాపాలను పర్యవేక్షించే ఒక స్వచ్ఛంద సంస్థ తెలిపింది. జిబోలోని ఒక పోలీస్ స్టేషన్, మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని ఆదివారం తెల్లవారుజామున జేఎన్‌ఐఎం దాడికి పాల్పడింది. అధికారికంగా ప్రాణనష్టం గురించిన వివరాలు వెల్లడికానప్పటికీ, జిబో నివాసితులు కూడా ఈ దాడుల్లో డజన్ల కొద్దీ మరణించినట్లు తెలుస్తోంది. బుర్కినా ఫాసో పొరుగునే ఉన్న మాలి, నైజర్ వంటి దేశాలు కూడా చాలా కాలంగా ఉగ్రవాద దాడులకు గురవుతున్నాయి. ఈ ప్రాంతాలు మొత్తం అల్-ఖైదా మద్దతుగల ఉగ్రవాదులకు నిలయంగా మారాయి.

బుర్కినా ఫాసోలోని జేఎన్‌ఐఎం అధిపతి ఉస్మాన్ డికో.. జిబో నివాసితులను ఇళ్లు ఖాళీ చేయమని ఆదేశిస్తున్న ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఉగ్రసంస్థ వరస దాడులకు పాల్పడుతూ భూభాగాలను ఆక్రమించుకుంటూ వెళ్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2 లక్షల మంది జనాభా ఉన్న జిబో నగరంలోని కీలక సైనిక తనిఖీ కేంద్రం తాజా దాడిలో పూర్తిగా ధ్వంసమైంది. సాయుధ దళాల మందుగుండు సామాగ్రిని కూడా ఉగ్రమూకలు నాశనం చేశాయి. బుర్కినా ఫాసోలో జరిగిన అత్యంత ఘోరమైన దాడుల్లో ఇదీ ఒకటని బుర్కినా ఫాసో సైనిక నాయకుడు ఇబ్రహీం ట్రోరే వెల్లడించారు.

అయితే మృతి చెందిన సైనికుల సంఖ్యను జేఎన్‌ఐఎం ఎక్కువ చేసి చెబుతోందని బుర్కినా ఫాసో సైనిక వర్గాలు వాదిస్తున్నాయి. అమెరికాకు చెందిన ఎస్‌ఐటీఈ ఇంటెలిజెన్స్ గ్రూప్ ఒక అధికారిక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపింది. ఆఫ్రికాలోని సాయుధ గ్రూపుల ఆన్‌లైన్ కార్యకలాపాలను ఈ బృందం పర్యవేక్షిస్తుంది.

# పాక్ రుణానికి ఐఎంఎఫ్ షరతులు




పాకిస్థాన్‌కు 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నిధులను మంజూరు చేయడానికి ఐఎంఎఫ్ పలు షరతులు విధించింది. అంతే కాకుండా భారత్‌తో ఉద్రిక్తతలు ఇంకా పెంచుకోవడం వల్ల పాకిస్థాన్‌కే ఎక్కువ సమస్యలు వస్తాయని చురకలు అంటించింది. ఈ ఘర్షణలు దేశంలో ఆర్థిక, బాహ్య సంస్కరణల లక్ష్యాలకు ముప్పు కలిగిస్తాయని హెచ్చరించింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల వల్ల స్టాక్ మార్కెట్ మొదట నష్టాల్లోకి వెళ్లినప్పటికీ..ప్రస్తుతం స్థిరంగా ఉన్నాయని ఐఎంఎఫ్ నివేదికలు పేర్కొన్నాయి.

ఐఎంఎఫ్ ఇస్తున్న నిధులను పాక్ అభివృద్ధికి కాకుండా ఉగ్రవాదులను పోషించడానికి వినియోగిస్తోందని భారత్ ఇటీవల ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొంది. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పాక్‌కు నిధులు సమకూర్చడంపై ఐఎంఎఫ్‌పునరాలోచించాలని మోదీ ప్రభుత్వం కోరినప్పటికీ.. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి పాక్‌కు 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8.540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది.

ఐఎంఎఫ్ షరతులు..

పాకిస్థాన్‌లోని నాలుగు ప్రావిన్సులు కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలని అమలు చేయాలని, పన్ను రిటర్నింగ్ ప్రాసెసింగ్, పన్ను చెల్లింపుదారుల గుర్తింపు, నమోదు, కమ్యూనికేషన్ క్యాంపెయిన్ కోసం కార్యాచరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటివి ఐఎంఎఫ్ షరతుల్లో ఉన్నాయి. ఇందుకోసం ప్రావిన్స్‌లకు ఈ ఏడాది జూన్ వరకూ గడువు విధించింది. 2027 తర్వాత ఆర్థిక రంగ వ్యూహాన్ని వివరించే ప్రణాళికను సైతం సిద్ధం చేయాలి. ఇంధన రంగంలో నాలుగు కొత్త షరతులు అమలు చేయాలి. జూలై 1 నాటికి వార్షిక విద్యుత్ సుంకాల పునర్వవస్థీకరణ నోటిఫికేషన్లు జారీ చేయాలి. అలాగే 2035 కల్లా ప్రత్యేక సాంకేతిక జోన్లు, ఇతర పారిశ్రామిక ప్రాంతాలకు సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలు తొలగించేందుకు ప్రభుత్వం ఒక ప్రణాళికలను ఈ ఏడాది చివరిలోగా సిద్ధం చేయాలని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది.

# ఉక్రెయిన్‌పై వందలాది డ్రోన్లతో రష్యా దాడి



ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రే ఏకంగా వందలాది డ్రోన్లను ప్రయోగించింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైన తరువాత మాస్కో జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటని ఉక్రెయిన్ వర్గాల సమాచారం. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య ముఖాముఖి శాంతి చర్చలు జరిగిన రోజుల వ్యవధిలోనే ఈ భారీ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.

కీవ్, నిప్రోపెట్రోవ్స్, డొనెట్స్, తదితర ప్రాంతాలే లక్ష్యంగా రష్యా దాడులకు తెగబడింది.. 279 ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించింది.. వాటిలో 88 డ్రోన్లను కూల్చివేశామని అని ఉక్రెయిన్ వైమానికదళం తెలిపింది. సంఖ్యాపరంగా ఇదే అతిపెద్ద డ్రోన్ దాడిగా తెలుస్తోంది. గతంలో మాస్కో ఓసారి 267 డ్రోన్లు ప్రయోగించింది. తాజా దాడుల్లో కీవ్ ప్రాంతంలో ఓ మహిళ మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయని చెప్పారు. కీవ్ ప్రయోగించిన డ్రోన్లనూ కూల్చివేసినట్లు అటు రష్యా రక్షణశాఖ ప్రకటించింది.

యుద్ధానికి కారణమైన అంశాలకు ముగింపు పలకడం, శాశ్వత శాంతి కోసం పరిస్థితులను సృష్టించడం, దేశ భద్రతకు హామీ వంటివి తమ లక్ష్యాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదివారం స్పష్టం చేశారు. ఉక్రోయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్సులు రష్యాకు చెందుతాయని అంగీకరించడం వంటివి నెరవేర్చాలని మాస్కో మొదటినుంచి డిమాండ్ చేస్తోంది. మరోవైపు.. రక్తపాతం ఆపడమే తన ఎజెండా అని, ఈ విషయమై పుతిన్ మాట్లాడతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు



గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులను కొనసాగిస్తోంది శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరపడంతో ఖాన్‌యూనిస్లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జాబాలియాలోని శరణార్థి శిబిరంలో 26 మంది మరణించారు. మొత్తం 103 మంది మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 9మంది ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు చిన్నారులు మృత్యువాత పడినట్లు అధికారులు పేర్కొన్నారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఎటువంటి ప్రకటనా చేయలేదు. కాగా శనివారం ఒక్కరోజే 150 మంది ప్రాణాలు కోల్పోయారని, 450 మందికి గాయాలయ్యాయని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి 3 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మృత్యువాతకు గురయ్యారని వెల్లడించింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు తెలిపారు. మా బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోంది. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల ఒప్పందం కొనసాగింపును తిరస్కరించింది. ఈ నేపథ్యంలోనే దాడులకు ఆదేశించాం. యుద్ధం లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా తమ దళాలు దాడులు చేస్తున్నాయని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# గుజరాత్ ఓపెనర్ల ఊచకోత

### 10 వికెట్లతో ఢిల్లీపై ఘన విజయం - ప్లే ఆఫ్స్‌కు గిల్ సేన



ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని చేరుకుంది. ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభమన్ గిల్ తమ వేరే లెవెల్ ఇన్నింగ్స్ అలరించగా, ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది. అదే సమయంలో ఢిల్లీ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి.

టాస్ ఓడి ముందు బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు, 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టపోయి 199 పరుగులు సాధించింది. కేఎల్ రాహుల్ (112: 65 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ ఈ ఇన్నింగ్స్ ద్వారా కేఎల్ రాహుల్ అరుదైన ఘనత సాధించాడు. టీ 20 క్రికెట్‌లో అత్యంత వేగంగా 8,000 పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగా కేఎల్ రాహుల్ రికార్డు నెలకొల్పాడు.

ఇప్పటికే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 243 ఇన్నింగ్స్‌ల్లో 8 వేల పరుగుల మైలురాయి అందుకోగా, రాహుల్ 224 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు. కింగ్ రికార్డును బ్రేక్ చేశాడు. అయితే ఢిల్లీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్ (21), అభిషేక్ పోరెల్ (30), అక్షర్ పటేల్ (25), డుప్లెసిస్ (5) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్, సాయి కిశోర్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ తీశారు.

అయితే ఢిల్లీ నిర్దేశించిన లక్ష్యాన్ని గుజరాత్ 19 ఓవర్లలోనే సునాయసంగా ఛేదించింది. సాయి సుదర్శన్ (77: 48 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (73: 43 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సలు) తమ ఇన్నింగ్స్‌తో దంచికొట్టారు. ఢిల్లీ బౌలర్లకు అస్సలు ఛాన్స్ ఇవ్వలేదు. బౌండరీలతో మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. కాగా, ఈ మ్యాచ్ ఫలితంలో కేవలం గుజరాతే జట్టే కాదు, పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ జట్లు కూడా తమ ప్లే ఆఫ్స్ బెర్తులను ఖరారు చేసుకున్నాయి.

## చరిత్ర సృష్టించిన కేఎల్ రాహుల్



ఢిల్లీ స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చరిత్ర సృష్టిచాడు. టీ20 క్రికెట్‌లో అత్యంత వేగంగా 8 వేల పరుగులు చేసిన భారత క్రికెటర్‌గా కేఎల్ రాహుల్ రికార్డు నెలకొల్పాడు. ఈ నేపథ్యంలోనే రన్ మెషీన్ విరాట్ కోహ్లీ రికార్డును కూడా బద్ధలు కొట్టాడు. కింగ్ కోహ్లీ 243 ఇన్నింగ్స్‌ల్లో 8వేల పరుగుల మైలురాయిని చేరుకోగా.. కేఎల్ రాహుల్ కేవలం 224 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ రికార్డును సాధించడం గమనార్హం. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తరఫున కేఎల్ రాహుల్ ఆడుతున్న సంగతి తెలిసిందే. గుజరాత్ టైటాన్స్ జట్టుపై ఈ ఫీట్ ను సాధించాడు కేఎల్ రాహుల్. ఈ మ్యాచ్‌లో తన సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. 60 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు.

ఇదిలా ఉండగా.. టీ20ల్లో అతి తక్కువ ఇన్నింగ్స్‌ల్లో 8000 పరుగులు పూర్తి చేసిన మూడో బ్యాటర్‌గా కూడా కేఎల్ రాహుల్ రికార్డును సాధించాడు. టీ20ల్లో అత్యంత వేగంగా 8 వేల పరుగులు పూర్తి చేసి ఘనత వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. క్రిస్ గేల్ 213 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనతను సాధించాడు. పాకిస్థాన్ ఆటగాడు బాబర్ ఆజం 2022లో తన 227 మ్యాచ్‌లు, 218 ఇన్నింగ్స్‌లలో ఈ మైలురాయిని సాధించాడు. మూడో స్థానంలో కేఎల్ రాహుల్ ఉండగా.. తర్వాతి స్థానాల్లో వరుసగా విరాట్ కోహ్లీ, పాక్ క్రికెట్ మహ్మద్ రిజ్వాన్(244) ఉన్నారు.

***టీ20ల్లో అత్యంత వేగంగా 8000 పరుగులు చేసిన ఆటగాళ్లు వీరే..***

*1.క్రిస్ గేల్ - 213 ఇన్నింగ్స్*
*2.బాబర్ ఆజం - 218 ఇన్నింగ్స్*
*3.కేఎల్ రాహుల్ -224 ఇన్నింగ్స్*
*4. విరాట్ కోహ్లీ -243 ఇన్నింగ్స్*
*5.మహ్మద్ రిజ్వాన్ -244 ఇన్నింగ్స్*
*6. ఆరోన్ ఫించ్ - 254 ఇన్నింగ్స్*

# ఉత్కంఠ పోరులో పంజాబ్ విజయం

### పోరాడి ఓడిన రాజస్థాన్

బ్యాటర్లు నేహాల్ వధేరా, శశాంక్ సింగ్‌లు అద్భుతమైన బ్యాటింగ్, బలమైన బౌలింగ్ సాయంతో పంజాబ్ కింగ్స్ రాజస్థాన్ రాయల్స్ జట్టును 10 పరుగుల తేడాతో ఓడించింది. ఐపీఎల్ 2025లో 59వ మ్యాచ్‌లో విజయం సాధించడంతో పంజాబ్ కింగ్స్ జట్టు ప్లేఆఫ్స్ స్థానాన్ని బలోపేతం చేసుకుంది. పంజాబ్ కింగ్స్ ఆడిన 12 మ్యాచ్‌ల్లో ఇది 8వ విజయం కాగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. 17 పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుని ప్లేఆఫ్స్ రేసులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 2014 తర్వాత పంజాబ్ తొలిసారి ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది.

జైపూర్‌లోని సవాయ్ మాన్సింగ్ క్రికెట్ స్టేడియంలో రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలు రాజస్థాన్ తరపున అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. మంచి ఆరంభం లభించినప్పటికీ ఆ జట్టు 20 ఓవర్లలో 209 పరుగులు మాత్రమే చేయగలిగింది. రాజస్థాన్ తరపున యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురేల్ అర్థ సెంచరీలు సాధించినా పంజాబ్ బౌలర్లు పుంజుకోవడంతో ఓటమి పాలైంది.

ఫలించని యశస్వి, ధ్రువ్ జురేల్ ప్రయత్నాలు



ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ జట్టు కోల్పోవడానికి ఏమీ లేదు. అయినప్పటికీ యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురేల్ తమ జట్టును విజయపథంలో నడిపించడానికి తమ శాయశక్తులా ప్రయత్నించారు. యశస్వి జైస్వాల్ జట్టు తరఫున 25 బంతుల్లో 50 పరుగులు చేశాడు. ఈ సమయంలో జైస్వాల్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్లోనే అర్ష్ దీప్ సింగ్ బౌలింగ్ లో 22 పరుగులు బాదాడు. ఈ ఇన్నింగ్స్‌లో యశస్వి 9 ఫోర్లు, 1 సిక్స్ కూడా కొట్టాడు. ఈ సమయంలో యశస్వికి ఇన్నింగ్స్ ప్రారంభంలో వైభవ్ సూర్యవంశీ నుండి కూడా మద్దతు లభించింది. వైభవ్ 15 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 40 పరుగులు చేసి ఔటయ్యాడు.

తర్వాత ధ్రువ్ జురేల్ చివరి ఓవర్ వరకు రాజస్థాన్ జట్టు ఆశలను సజీవంగా ఉంచడానికి ప్రయత్నించాడు కానీ 31 బంతుల్లో 53 పరుగులు చేసిన తర్వాత అతను ఔట్ అయ్యాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున ధ్రువ్ జురేల్ కాకుండా సంజూ శాంసన్ 20 పరుగులు , షిమ్రాన్ హెట్మెయర్ 11 పరుగులు అందించారు.

బౌలింగ్ విషయానికొస్తే, పంజాబ్ తరఫున హర్‌ప్రీత్ బ్రార్ అత్యధికంగా 3 వికెట్లు పడగొట్టాడు. ఇది కాకుండా, మార్కో యన్సెన్, అజ్మతుల్లా ఒమర్జాయ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

**పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్..**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. రాజస్థాన్ రాయల్స్‌కు 220 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. పంజాబ్ కింగ్స్ బ్యాటర్లలో నేహాల్ వధేరా, శశాంక్ సింగ్‌లు అర్ధ శతకాలతో అద్భుతంగా రాణించారు. నేహాల్ వధేరా 37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సులతో 70 పరుగులు చేశాడు. శశాంక్ సింగ్ 30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులతో 59 పరుగులు చేశాడు. చివరలో అజ్మతుల్లో ఒమర్జాయ్ 9 బంతుల్లోనే 21 పరుగులు చేశాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రభ్ సిమ్రాన్ సింగ్ 21 పరుగులతో పరవాలేదనిపించారు. పంజాబ్ కింగ్స్ బ్యాటర్లలో ప్రియాన్ష్ ఆర్య(9), మిచెల్ ఓవెన్(0) విఫలం అయ్యారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో తుషార్ దేశ్ పాండే 2 వికెట్లు పడగొట్టగా.. క్వేనా మఫాక్, రియాన్ పరాగ్, ఆకాష్ మధ్వల్ తలో వికెట్ తీసుకున్నారు.

### సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్

# బంగ్లాదేశ్‌తో ఫైనల్.. విజేతగా భారత్

సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్(SAFF U-19) అండర్ 19 మెన్స్ విజేతగా భారత్ అవతరించింది. బంగ్లేదేశ్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ముందుగా 1-1తో రెండు జట్ల స్కోర్ సమం కాగా.. పెనాల్టీ షూటౌట్‌లో 4-3 తేడాతో భారత్ గెలుపొందింది.

ఆదివారం అరుణాచల్ ప్రదేశ్‌లోని గోల్డెన్ జూబ్లీ స్టేడియంలో జరిగిన సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అండర్-19 ఛాంపియన్ షిప్ టైటిల్‌ను పెనాల్టీ షూటౌట్ ద్వారా 4-3 తేడాతో బంగ్లాదేశ్ ను ఓడించి భారత్ కైవసం చేసుకుంది. ఇచ్చిన సమయంలో స్కోర్లు 1-1తో ఉండటంతో మ్యాచ్ పెనాల్టీలకు దారితీసింది. ఆ సమయంలో అభిమానుల్లో ఒంటికాలిపై నిలబడేంత ఉత్కంఠ నెలకొంది.

ఆట ప్రారంభమైన రెండో నిమిషంలోనే భారత్ కెప్టెన్ సింగమాయుమ్ షమీ డైరెక్ట్ ఫ్రీ కిక్ కొట్టడంతో భారత జట్టు ఒక గోల్ ఆధిక్యంలో నిలిచింది. ఇదిలా ఉండగా రెండో అర్ధభాగంలో బంగ్లాదేశ్‌కు చెందిన ఎండీ జాయ్ అహ్మద్ 61వ నిమిషంలో గోల్ సమం చేశాడు. ఈ క్రమంలో పెనాల్టీ షూటౌట్ ద్వారా భారత్ విజయం సాధించింది. 2023 ఎడిషన్ ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన తర్వాత భారత్ సాధించిన రెండో సౌత్ ఏషియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్(SAFF U-19) అండర్ 19 టైటిల్ ఇది.









బ్లో అప్

నభా నటేష్

# కిర్రాక్ లుక్స్‌తో కీర్తి సురేష్

హీరోయిన్ కీర్తి సురేష్ గత ఏడాది డిసెంబర్‌లో వివాహం చేసుకుంది. తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనీని హిందూ, క్రిష్టియన్ సంప్రదాయంలో వివాహం చేసుకుంది. ఆతర్వాత కూడా కీర్తి సురేష్ సోషల్ మీడియాలో హీటెక్కించే ఫొటోస్ వదులుతూ చాల యాక్టీవ్‌గా కనిపిస్తోంది.

హిందీలో బేబీ జాన్ తర్వాత మరో క్రేజీ ప్రాజెక్ట్ కీర్తి సురేష్‌ని వరించింది అనే న్యూస్ ఉంది. మరోపక్క కొద్దిరోజులుగా సోషల్ మీడియాకి గ్యాప్ ఇచ్చిన కీర్తి సురేష్ తాజాగా దుబాయ్ డైరీస్ అంటూ కిర్రాక్ లుక్‌లో అదిరిపోయే ఫోటోలకు ఫోజులిచ్చింది. రెడ్ సిల్క్ శారీలో స్లీవ్ లెస్ బ్లౌజ్‌తో కీర్తి సురేష్ బ్యూటిఫుల్ లుక్‌లో కనిపించింది.

వివాహం అయ్యాక మరింత బ్రైట్‌గా వెలిగిపోతున్న కీర్తి సురేష్ గ్లామర్ లుక్స్ మాత్రం యూత్‌ని దాటిపోవట్లేదు. ఒకప్పుడు బొద్దుగా కనబడిన కీర్తి సురేష్ ఇప్పుడు స్లిమ్‌గా మారిపోయింది. నాజూకైన గ్లామర్‌తో మత్తెక్కిస్తుంది. క్రేజీ గ్లామర్‌తో అందరి చూపు తనవైపు ఉండేలా చూసుకోవడంలో సక్సెస్ అవుతుంది.

# 30న యాక్షన్‌తో రఫ్ఫాడించేందుకు సిద్ధమైన 'భైరవం' హీరోలు!



టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న చిత్రాల్లో మల్టీస్టారర్ చిత్రంగా తెరకెక్కిన మూవీ 'భైరవం'. దర్శకుడు విజయ్ కనకమేడల డైరెక్ట్ చేస్తున్న ఈ రస్టిక్ యాక్షన్ డ్రామా చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ చిత్రంపై మంచి బజ్ క్రియేట్ చేసింది. ఇక తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

ఈ ట్రైలర్ ఆద్యంతం రస్టిక్ యాక్షన్‌తో ఆకట్టుకుంటుంది. ధర్మం కోసం నిలబడే ముగ్గురు స్నేహితుల కథే ఈ సినిమాలో మనకు చూపెట్టబోతున్నట్లు ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఇక ఓ దేవాలయం చుట్టూ ఈ కథ సాగుతుండటం.. దాని కోసం స్నేహితులు శత్రువులుగా ఎలా మారుతారు అనేది మనకు ఈ సినిమా కథగా దర్శకుడు చూపెట్టబోతున్నాడు. ఈ సినిమాలో ముగ్గురు హీరోలు పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో పాటు ఆకట్టుకునే డైలాగులు కూడా చెబుతారని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఇంటెన్స్ యాక్షన్‌తో ఈ సినిమాను మేకర్స్ తెరకెక్కించారు. ఈ సినిమాలో అదితి శంకర్, ఆనంది, దివ్యా పిళ్లై, జయసుధ, అజయ్, వెన్నెల కిషోర్, సందీప్ రాజ్ అజయ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె.రాధామోహన్ ప్రొడ్యూస్ చేశారు. మే 30న ఈ సినిమాను గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.



# 'వీరమల్లు'పై బంద్ ఎఫెక్ట్.. ఫ్యాన్స్ ఆందోళన!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'హరిహర వీరమల్లు' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేయగా హిస్టారికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ మూవీ రానుంది. ఇక ఈ సినిమాను పలుసార్లు వాయిదా వేస్తూ వచ్చిన చిత్ర యూనిట్ ఎట్టకేలకు జూన్ 12న ఈ సినిమాను వరల్డ్‌వైడ్ రిలీజ్‌కు రెడీ చేశారు.

కానీ, ఈసారి కూడా పవన్ సినిమా చెప్పిన టైమ్‌కు వచ్చేలా సూచనలు కనిపించడం లేదు. జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల బంద్‌కు ఎగ్జిబిటర్లు పిలుపునిచ్చారు. వారి సమస్యలు పరిష్కరించేంత వరకు నిరవధిక బంద్‌ను కొనసాగిస్తామని వారు తెలిపారు. దీంతో జూన్ నెలలో రిలీజ్ అయ్యే చిత్రాల పరిస్థితి అయోమయంగా మారింది.

మరి వీరమల్లు చిత్రానికి ఈ బంద్ ఎఫెక్ట్ ఎంతమేర చేటు చేస్తుందో చూడాలి. ఈసారైనా తమ అభిమాన హీరో సినిమాను థియేటర్లలో అనౌన్స్ చేసిన సమయానికి అభిమానులు చూడగలుగుతారా లేదా అనేది వేచి చూడాలి.



# జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు బంద్!

తెలుగు రాష్ట్రాలకు చెందిన మూవీ ఎగ్జిబిటర్లు తాజాగా సమావేశం అయ్యారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఏకంగా 65 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. వారు ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు.

సినీ పరిశ్రమలో ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శించలేమని వారు తేల్చి చెప్పారు. అద్దె ప్రాతిపదికన సినిమాల ప్రదర్శన ద్వారా తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని థియేటర్ల ఓనర్లు తెలిపారు. తమ నిర్ణయాన్ని ప్రొడ్యూసర్ కౌన్సిల్, ప్రొడ్యూసర్ గిల్డ్‌కు తెలియజేస్తామని తెలుగు ఫిలిం ఛాంబర్ పేర్కొంది. ప్రొడ్యూసర్లు తమ నిర్ణయాన్ని గౌరవించి, తమకు సహకరించకపోతే జూన్ 1 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు బంద్ చేయాలని వారు నిర్ణయం తీసుకున్నారు.

# పూరితో నా బాండింగ్ చాలా బావుంది

*మరో సినిమా చేస్తా : విజయ్ దేవరకొండ*



*యంగ్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం కింగ్ డమ్ ప్రమోషన్స్ లో ఉన్నారు. గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన కింగ్ డమ్ జులై 4 న పాన్ ఇండియా మూవీ గా విడుదల కాబోతుంది. దానితో విజయ్ దేవరకొండ నేషనల్ మీడియాలో సినిమా పై అంచనాలు పెంచుతూ ఇంటర్వ్యూస్ ఇస్తున్నారు. రీసెంట్ గా ఫిలిం ఫేర్ మ్యాగజైన్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ ఆసక్తికర విషయాలు వెల్లడించారు.*

*పూరి జగన్నాథ్ తో చేసిన లైగర్ చిత్రం తర్వాత తను చాలా మారాను అని, లైగర్ డిజప్పాయింట్ చేసింది, ఆ చిత్రంతో హిట్ కొట్టాలని, పాన్ ఇండియాలో బెస్ట్ ఫిలిం గా నిలవాలని చాలా కష్టపడ్డాము, కానీ లైగర్ మా ఆశలపై నీళ్లు చల్లింది, పూరితో నా బాండింగ్ చాలా బావుంది, ఆయనతో మరో సినిమా కచ్చితంగా ఉంటుంది అంటూ విజయ్ దేవరకొండ కామెంట్స్ చేసారు.*

*లైగర్ చిత్రం హిట్ అయ్యి ఉంటే విజయ్ దేవరకొండ పూరి తో జన గణ మన చేసేవారు. ఆ సినిమా షూటింగ్ మొదలై ఆగిపోయింది. లైగర్ ఫ్లాప్ వలన జన గణ మన ని ఆపేసారు అనే విషయం తెలిసిందే.*

*ఇక నాగ్ అశ్విన్, సందీప్ రెడ్డి వంగ, తరుణ్ భాస్కర్ తో మంచి ర్యాపో ఉందని, వారి సినిమాల హిట్ ను తను కూడా సెలెబ్రేట్ చేసుకుంటాను అని చెప్పిన విజయ్ దేవరకొండ నాగ్ అశ్విన్ కి తనంటే సెంటిమెంట్ అని, అందుకే అన్ని సినిమాల్లో తనని పెట్టుకుంటాడని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసారు.*



# ఆప్టే సినిమాకు అవార్డుల పండుగ

*కొత్తగా పెళ్లయిన అమ్మాయి చాలా ఊహలు కలల్లో జీవిస్తుంది. భర్తపై చాలా అంచనాలు పెట్టుకుంటుంది. కానీ వాటన్నిటికీ విరుద్ధంగా జీవించాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. పెళ్లయాక ముంబై స్లమ్స్‌లో జీవించే ఒక కలలు కనే అమ్మాయి జీవితం ఆ తర్వాత ఎలా టర్న్ అయింది? అనే ఇంట్రెస్టింగ్ కథాంశంతో రూపొందించిన ప్రయోగాత్మక చిత్రం 'సిస్టర్ మిడ్ నైట్'.*

*ఈ చిత్రానికి కరణ్ కంధారి దర్శకత్వం వహించారు. బాఫ్టా, కేన్స్ సహా పలు అంతర్జాతీయ పురస్కారాలకు నామినేట్ అయిన ఈ చిత్రంలో రాధిక ఆప్టే నటనా వైవిధ్యం ఎంతో ఆకట్టుకుంటోంది.*

*ఈ సినిమా ట్రైలర్ ఆద్యంతం.. కొత్తగా పెళ్లయిన యువతి జీవితం, భావోద్వేగాల నేపథ్యంలో ఎంతో రక్తి కట్టిస్తోంది. రాధిక ఆప్టే సహజసిద్ధమైన నటన, వేషధారణ ఆకట్టుకున్నాయి. ప్రతిసారీ ఏదో ఒక ప్రయోగానికి సిద్ధంగా ఉండే రాధిక ఆప్టే మరోసారి ఇలాంటి ప్రయోగాత్మక చిత్రంలో నటించడం ఆసక్తిని కలిగిస్తోంది. ప్రస్తుతం సిస్టర్ మిడ్ నైట్ ట్రైలర్ ఇంటర్నెట్‌లో వైరల్ గా మారుతోంది. డార్క్ కామెడీ నేపథ్యంలోని ఈ చిత్రం మే 23న విడుదలకు సిద్ధమవుతోంది.*